ప్రగతిశీల సమాజం మనందరి బాధ్యత

- వైతాళికుల చిత్రపటాల ఆవిష్కరణ సభలో తెలకపల్లి రవి

6

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 349 | విజయవాడ, సోమవారం 22 జులై 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 22 July 2024 | Rs



ఘోష్, హర్మన్‌ప్రీత్ అర్ధ సెంచరీలు

- యుఎఇపై భారత్ ఘన విజయం
- సెమీస్‌లో స్థానం ఖాయం
- మహిళా ఆసియా కప్

3

ముంపులో పలు గ్రామాలు

- ఉగ్రరూపం దాల్చుతున్న 'గోదావరి'
- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక
- పోలవరం విలీన గ్రామాల ప్రజలు అవస్థలు
- బాధితులకు సిపిఎం పరామర్శ
- ఇతర రాష్ట్రాలకూ నిలిచిన రాకపోకలు
- 'శ్రీశైలానికి' భారీగా వరద నీరు



భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి

ప్రజాశక్తి- యంత్రాంగం

పోలవరం విలీన మండలాల్లోని పలు గ్రామాలు ముంపులోనే ఉన్నాయి. వర్షాల ప్రభావంతో వాగులకు, గెడ్డలకు గండ్లు పడడం, రోడ్లు కోతకు గురికావడం, కాలువలు, చెక్ డ్యాములు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద నీరు చుట్టుముట్టడంతో గ్రామాల నుంచి బయటకు రాలేని స్థితిలో ఉన్నారు. గుట్టలు, సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. అవకాశం ఉన్న వారు వరద నీటిలోనే ఇతర ప్రాంతాలకు తరలిపోతున్నారు. మరో వైపు గోదావరి రానురానూ ఉగ్రరూపం దాల్చుతోంది. భద్రాచలం వద్ద శనివారం 34 అడుగులున్న నీటిమట్టం ఆదివారం రాత్రి 43 అడుగులకు చేరింది. 8,85,224 క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద వస్తుండడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గోదావరి ఉధృతి పెరుగుతుండడంతో ఏలూరు జిల్లాలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాలను వరద చుట్టుముడుతోంది. దీంతో, ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలను యుద్ధప్రాతిపదికన సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కావడంతో గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. పంట పొలాలకు ముంపు తీవ్రత పెరిగింది. పెదవాగు ప్రాజెక్టుకు గండిపడడంతో వరద ఉధృతికి సర్వం కోల్పోయి కట్టుబట్టలతో రోడ్డున పడిన ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని అల్లూరి నగర్, కోయమాధవరం, మద్దిగట్ల గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటించింది. బాధితులతో మాట్లాడింది. ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని, ప్రభుత్వం ఆదుకునే వరకూ అన్నిరకాల ఒత్తిళ్లు తీసుకొస్తామని వారికి భరోసా ఇచ్చింది. అల్లూరి జిల్లా మిగతా 5లో



అల్లూరి జిల్లా పోలవరం గ్రామానికి చెందిన గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో డోలీలో మోస్తూ ఆసుపత్రికి తీసుకెళ్తున్న స్థానికులు

డోలీ మోతతో ఆస్పత్రికి గర్భిణి తరలింపు

అడ్డతీగల మండలం దుచ్చర్తి పంచాయతీ పోలవరం గ్రామానికి చెందిన నిండు గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో గ్రామం నుంచి మూడు కిలోమీటర్లు దూరం వరకు జోరు వానలో డోలీలో అతికష్టంమీద మోసుకెళ్లారు. అక్కడి నుంచి అడ్డతీగల సిహెచ్‌సికి 108లో తరలించారు.



సమావేశానికి హాజరైన అఖిలపక్షం నేతలు

అఖిలపక్ష భేటీలో ప్రత్యేక హోదా హోరు

- ఏపి నుంచి వైసిపి డిమాండ్, టిడిపి మౌనం
- 'దేశం' తీరుపై కాంగ్రెస్ విస్మయం
- బీహార్ కోసం ఎన్‌డిఎ భాగస్వామి జెడియు, ఆర్‌జెడి, ఎల్‌జెపి పట్టు
- ఒడిషా కోసం గళమెత్తిన బిజెడి
- నేటి నుంచి వాడిగా వేడిగా పార్లమెంటు

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆదివారం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిల పక్ష సమావేశంలో ప్రత్యేక హోదా కోసం వివిధ పక్షాలు గళమెత్తాయి. విభజన సమయంలో పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీ ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని వైసిపి నినదించగా..అధికార టిడిపి మౌనం దాల్చింది. ఎన్‌డిఎ భాగస్వామిగా ఉండి కూడా రాష్ట్రం కోసం గళమెత్తకుండా టిడిపి మౌనం దాల్చడంపై కాంగ్రెస్ విస్మయం వ్యక్తం చేసింది. బీహార్ నుంచి ఎన్‌డిఎ భాగస్వామి జెడియు ఆ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం పట్టుబట్టింది. జెడియుతో పాటు ఆర్‌జెడి, ఎల్‌జెపి కూడా హోదా కోసం గళమెత్తాయి. ఈ రెండు రాష్ట్రాలతో పాటు ఒడిషాకు కూడా ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనంటూ బిజెడి డిమాండ్ చేసింది. పార్లమెంట్ వేదికగా తమ గొంతు వినిపించేందుకు అవకాశం ఇస్తామన్న భరోసా కల్పించాలని ప్రతిపక్షాలు కోరాయి. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవి ప్రతిపక్షాలకు ఇవ్వాలని డిమాండ్ చేశాయి. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రతిపక్షాలు నీట్ పేపర్ లీక్, నిరుద్యోగం, ధరలు పెరుగుదల, అగ్నివీర్ పథకం రద్దు, కన్వర్ యాత్ర సందర్భంగా దుకాణ యజమానులు, సిబ్బంది తమ పేర్లను బహిరంగ పరచాలంటూ యుపి, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు జారీ చేసిన వివాదాస్పద ఉత్తర్వులపైన, లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవి వంటి పలు అంశాలను లేవనెత్తాయి. పార్లమెంట్ సమావేశాల నిర్వహణకు సహకరించాలని ప్రభుత్వం అన్ని పక్షాలను కోరింది. ఈ అఖిల పక్ష సమావేశంలో ప్రభుత్వం తరపున కేంద్ర మంత్రులు జెపి నడ్డా, కిరణ్ రిజిజు హాజరు కాగా, కాంగ్రెస్ నేతలు జైరాం రమేష్, గౌరవ్ గొగోయ్, కె సురేష్ హాజరయ్యారు. టిడిపి ఎంపిలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, గండి హరీష్, జనసేన ఎంపి వల్లభనేని బాలశౌరి, వైసిపి మిగతా 5లో

రాష్ట్ర హక్కుల కోసం నిలబడాలి

- టిడిపి ఎంపీలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు హితవు
- ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేలా అసెంబ్లీలో అన్నీ చర్చించాలని సూచన



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

రాష్ట్ర హక్కుల కోసం టిడిపి ఎంపీలు నిలబడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హితవు పలికారు. పార్లమెంటు, అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఆదివారం ఆయన ప్రకాశం జిల్లా ఒంగోలులోని సుందరయ్య భవన్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వంపై ప్రజలు కోటి ఆశలతో ఉన్నారని పేర్కొన్నారు. అరాచక, నిరంకుశ పాలన పోయిందని చెప్పుకుంటున్న తరుణంలో కొత్త ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తుందని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. ఇప్పుడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చంద్రబాబు, నితీష్‌కుమార్‌లపై ఆధారపడిందని, ఈ రెండు ఊతకర్రల సాయంతో పాలన సాగిస్తోందని వివరించారు. ఇప్పటికే నితీష్‌కుమార్ బీహార్‌కు ప్రత్యేక హోదా, నిధులు కోరారని, ఆయన ప్రణాళిక ఏమిటో ప్రకటించారని తెలిపారు. అయితే, చంద్రబాబు మౌనంగా ఉన్నారన్నారు. గతంలో జగన్ రాజీ ధోరణి అవలంబించడం వల్లనే మట్టి కరిచిపోయారని గుర్తు చేశారు. ఆ గుణపాఠాలను టిడిపి నేర్చుకొని మేల్కోకుంటే బిజెపి ధృత రాష్ట్ర కౌగిలికి బలి కాక తప్పదని హెచ్చరించారు. ప్రత్యేక హోదా, కడప స్టీల్ ఫ్యాక్టరీ, రాష్ట్ర విభజన హామీల కోసం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రయివేటీకరణ కాకుండా చూడడం కోసం పార్లమెంటులో గట్టిగా నిలబడాలని సూచించారు. టిడిపి పార్లమెంటు సభ్యుల సమావేశంలో సిఎం చంద్రబాబు కేంద్రం నుంచి ఎక్కువ నిధులు తేవాలని సూచించారే తప్ప, హక్కులపై ప్రస్తావన చేయలేదని గుర్తు చేశారు. బిజెపికి మద్దతు ఇచ్చే వైసిపి కూడా గట్టిగా ఉండాలన్నారు. రాష్ట్రం కోసం ఢిల్లీలో ధర్నాలు చేయాలని, ఇక్కడ ఏమైనా అల్లర్లు, మిగతా 2లో

కేరళలో నిపా వైరస్‌తో 14 ఏళ్ల బాలుడి మృతి

తిరువనంతపురం : కేరళలోని మలప్పురం జిల్లాకు చెందిన 14 ఏళ్ల బాలుడి ప్రాణాలను నిపా వైరస్ బలిగొంది. ఈ వైరస్ సోకి కోజికోడ్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు మృతి చెందినట్లు రాష్ట్ర ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ ఆదివారం తెలిపారు. బాలుడు కార్డియాక్ అరెస్టుతో మరణించినట్లు మంత్రి వెల్లడించారు. నిపా వైరస్ ఇన్ఫెక్షన్‌తోనే బాలుడు మరణించినట్లు పూణేకు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ కూడా నిర్ధారించింది. 2018లో నిపా వైరస్ కారణంగా మలప్పురం, కోజికోడ్ జిల్లాల్లో 17 మంది మరణించారు.

అయితే, ప్రస్తుతం నిపా వైరస్ గురించి భయపడాల్సిన అవసరం లేదని మంత్రి వీణా జార్జ్ తెలిపారు. మృతి చెందిన బాలుడికి చెందిన ముగ్గురు బంధువులు కోజికోడ్ ఆసుపత్రిలో పర్యవేక్షణలో ఉన్నారని, అతనితో సన్నిహితంగా ఉన్న మరో నలుగురు మంజేరి ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో పరిశీలనలో ఉన్నారని మంత్రి చెప్పారు. వీరిలో ఎవ్వరికీ కూడా నిపా వైరస్ లక్షణాలు కనిపించడం లేదని చెప్పారు. ప్రజలు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, పరిస్థితి అదుపులోనే ఉందని తెలిపారు.

నేటి నుంచి అసెంబ్లీ

- ఐదు రోజులపాటు జరిగే అవకాశం
- ఆర్థికం, నేరాలు, మద్యం అంశాలపై శ్వేతపత్రాలు
- ఆర్డినెన్స్ ద్వారా ఓటాన్ అకౌంట్ కొనసాగింపు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ఐదేళ్ల పాలనలో జరిగిన అక్రమాలు, అన్యాయాలపై ప్రధానంగా చర్చించే దిశగా అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ముఖ్యంగా లా అండ్ ఆర్డర్, ఫైనాన్స్, ఎక్సైజ్‌పై కీలకంగా చర్చించనున్నట్లు తెలిసింది. 16వ అసెంబ్లీ రెండో సమావేశాలు సోమవారం నుంచి జరగనున్నాయి. దీనిలో భాగంగా ఉదయం 10 గంటలకు ఉభయ సభలనుద్దేశించి గవర్నరు ప్రసంగం ఉంటుంది. సాయంత్రం టిడిఎల్‌పి సమావేశం జరగనుంది. అసెంబ్లీ సమావేశాలు ఎన్ని రోజులు జరగాలనే అంశంపై బిఎసిలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. వేర్వేరు అంశాలపై శ్వేతపత్రాలు ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో కనీసం ఐదు రోజులపాటు జరపనున్నట్లు స్పీకరు అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. ప్రస్తుత ఓటాన్ అకౌంట్ గడువు ఈ నెల 31తో ముగియనున్న నేపథ్యంలో మరో రెండు నెలలపాటు కొనసాగించేలా ఆర్డినెన్స్ ఇవ్వనున్నారు. వైసిపి సభ్యులు కూడా సోమవారం సమావేశాలకు హాజరుకానున్నారు. గవర్నరు ప్రసంగం కావడంతో చర్చలేమీ ఉండవు. ఈ నేపథ్యంలో హాజరు కావాలని నిర్ణయించారు. మరునాడు రావాలా? వద్దా? అనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. ఢిల్లీలో ధర్నా నేపథ్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఢిల్లీ వెళతారని ఆ పార్టీ ఎంపి విజయసాయిరెడ్డి తెలిపారు. సోమవారం అసెంబ్లీ, మండలికి వచ్చే టిడిపి సభ్యులందరూ పసుపు రంగు దుస్తులు వేసుకుని రావాలని, సైకిల్ గుర్తు ఉన్న పసుపురంగు జెండా భుజాన వేసుకోవాలని టిడిఎల్‌పి సూచించింది. ఉదయం 8:30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంకటపాలెంలోని నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేయనున్నారు. అవకాశం ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరూ ఈ కార్యక్రమానికి రావాలని సూచించారు. సమావేశాల నేపథ్యంలో అసెంబ్లీ హెలిప్యాడ్, పార్కింగ్, ప్రధాన మార్గాల్లో శాంతిభద్రతలపై గుంటూరు జిల్లా ఎస్‌పి పర్యవేక్షించారు. అధికారులకు తగు సూచనలు చేశారు.

ఉద్యోగాలు ఉత్తమాటే

- భూములపైనే అదాని దృష్టి
- నెల్లూరుజిల్లాలో వేల కోట్ల భూ స్వాహా



కంటైనర్ టెర్మినల్ వెళ్లిన తరువాత ఖాళీగా కంటైనర్ యార్డ్‌లు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వాలు భూమితో పాటు, వివిధ రకాల ప్రోత్సాహకాలు ఇచ్చేది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తారనే! నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం అదాని గ్రూపు పోర్టు మాత్రం దీనికి భిన్నం! అదాని గ్రూపు ఈ పోర్టును స్వాధీనం చేసుకున్న తరువాత కొత్త ఉద్యోగాలు రాకపోగా, ఉన్న ఉద్యోగాలు కూడా ఊడుతున్నాయి. అదే సమయంలో పోర్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన వేల ఎకరాలను అదాని గ్రూపు సొంతం చేసుకుంది. నవయుగ కంపెనీ కృష్ణపట్నం పోర్టును ప్రారంభించిన సంగతి తెలిసిందే. పోర్టు కోసం దశల వారీగా 6,800 ఎకరాలు ఇచ్చారు. కంటైనర్ టెర్మినల్స్, కంటైనర్ యార్డ్, మిర్చియార్డ్‌లు, బొగ్గు, ఇసుప ఖనిజం నిల్వలు, ఇంటర్ నేషన్ స్కూల్, సెక్యూరిటీ శిక్షణ కేంద్రాలు, కార్మికులకు వసతి, వంటి అనేక భవనాలు ఏర్పాట్లు చేశారు. రానున్న రోజుల్లో ముంబయ్, విశాఖపట్నం, చెన్నయ్ పోర్టులు లాగా ఈ పోర్టు అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావం నెలకొంది. స్థానికులకు కూడా ఉద్యోగ అవకాశాలు లభించాయి. 2020లో ఈ పోర్టును అదాని గ్రూపు స్వాధీనం చేసుకుంది. నవయుగ నుండి అదాని గ్రూపు పోర్టును సొంతం చేసుకున్న తీరుపైనా విమర్శలు ఉన్న సంగతి తెలిసిందే. ఆ విషయం ఎలా ఉన్నా, అదాని గ్రూపు చేతుల్లోకి కృష్ణపట్నం పోర్టు వెళ్లిన తరువాత పరిస్థితి ఒక్కసారిగా మారింది. స్థానికులకు కొత్తగా ఉద్యోగాలు రాకపోగా, ఉన్న ఉద్యోగాలు ఊడుతున్నాయి. మరోవైపు పోర్టుకోసం అతి తక్కువ ధరకు ప్రభుత్వం కేటాయించిన భూములు అదానికి దక్కాయి.

భూములు ఇలా...!

రాష్ట్ర ప్రభుత్వం 2006 నుంచి 2012 వరకు కృష్ణపట్నం పోర్టుకు భారీగా భూములు కేటాయించింది. అందులో ప్రధానంగా ముత్తుకూరు, వెంకటాచలం, చిల్లకూరు మండలాలున్నాయి. 2011లో చిల్లకూరు మండలం తమ్మినపట్నంలో సర్వే నెం 138-1, 156, 166, 532, 557 తదితర చోట్ల 23 ఎకరాల ప్రభుత్వ భూమిని పోర్టుకి ఇచ్చారు. ముత్తుకూరు మండలం, ఈపూరులో సర్వే నెం 1709లో 200 ఎకరాల ఉప్పు మిగతా 2లో

లోపలి పేజీలో..

పోరాటాలతోనే బిఎస్‌ఎన్‌ఎల్ బలోపేతం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో నలుగురు మృతి

- 13 మందికి గాయాలు
- మూడు గేదెలు మృత్యువాత

ఉన్నత చదువులకెళ్లి విగతజీవులయ్యారు

- అమెరికా వెళ్లిన యువతి, యువకులు వేర్వేరు ఘటనల్లో మృతి

తుమ్మితే ఊడే ఉద్యోగం

- తయారీ రంగంలో పెరుగుతున్న కాంట్రాక్టు కార్మికులు

పోటీ నుంచి తప్పుకున్న బైడెన్



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష ఎన్నికల పోటీ నుంచి దేశాధ్యక్షుడు జో బైడెన్ తప్పుకున్నారు. అమెరికన్లు మరో నాలుగు నెలల్లో ఎన్నికలకు వెళ్లనుండగా, ఆయన చేసిన ఈ ప్రకటన రాజకీయంగా చర్చనీయాంశమైంది. దేశం, పార్టీ ప్రయోజనాల రీత్యా తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు బైడెన్ సామాజిక మాధ్యమాల్లో ఆదివారం ఒక సందేశం పోస్టు చేశారు. తను ఏ పరిస్థితుల్లో ఇంతటి తీవ్ర నిర్ణయం తీసుకోవాల్సివచ్చిందో ఈ వారాంతంలో సవివరంగా తెలియజేస్తానన్నారు. దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నట్లు అందులో పేర్కొన్నారు. 81 సంవత్సరాల వయసున్న బైడెన్ ఇటీవల కోవిడ్‌కు గురైన సంగతి తెలిసిందే. మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ నేతగా అధ్యక్ష పోటీలో బరిలో ఉన్న డొనాల్డ్ ట్రంప్ (78)తో కలిసి జరిగిన టివి చర్చల్లోనూ బైడెన్ తడబాటుకు గురయ్యారు. ఈ నేపథ్యంలో బైడెన్ పోటీ నుంచి తప్పుకోవాలని డెమోక్రాట్లకు చెందిన కాంగ్రెస్ ప్రతినిధులే బహిరంగంగా డిమాండ్ చేస్తూవచ్చారు. ఇప్పుడు బైడెన్ తప్పుకోవడంతో ట్రంప్‌ను ధీటుగా ఎదుర్కొగల నేతను ఎంపిక విషయంలో డెమొక్రాట్లు అయోమయంలో పడిపోయారు. వచ్చే ఆగస్టు 19న డెమొక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్ నిర్వహించనున్న నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ పరిణామం ఆ పార్టీ శ్రేణులను విస్మయానికి గురిచేస్తోంది. అమెరికాలో నవంబరు 5న అధ్యక్ష ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే.



గురువుల పట్ల గౌరవం తప్పనిసరి : సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గురువుల పట్ల గౌరవం తప్పనిసరిగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రామదూత స్వామి ఆధ్వర్యాన మంగళగిరి సికె కన్వెన్షన్‌లో ఆదివారం జరిగిన గురుపూర్ణిమ ఉత్సవంలో సిఎం పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. సత్యం, ధర్మం, ధ్యానం ద్వారా సమున్నత జీవన గమ్యం ఏర్పరచుకోవాలన్న వేదవ్యాసుడి ఉపదేశాన్ని అనుసరిస్తూ గురువుల పట్ల అత్యంత గౌరవంతో మెలగాలన్నారు. ప్రజలంతా మహోన్నత జీవనంతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

త్వరితగతిన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ : విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో వీలైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని అధికారులను ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆదేశించారు. రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, వరదల నేపథ్యంలో విద్యుత్ సంస్థల అధికారులతో ఆదివారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే 1912 నెంబర్‌ను సంప్రదించాలని ప్రజలను కోరారు. ఇపిడిసిఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి సర్కిళ్లు, ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని కర్నూలు, కడప, సిపిడిసిఎల్ పరిధిలోని సిఆర్‌డిఎ సర్కిళ్లు దెబ్బతిన్నాయని గుర్తించారు. ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని రాజమండ్రి, ఏలూరు సర్కిళ్లలో ప్రధానంగా నష్టం వాటిల్లిందని ఆ డిస్కం సిఎమ్‌డి ఐ పృథ్వీతేజ్ అన్నారు. కుకునూరు, వేలేరుపాడు, రాజీవ్‌నగరంలోని 33/11కెవి సబ్‌స్టేషన్లు దెబ్బతిన్నాయని తెలిపారు. సుమారు రూ.193.89 లక్షలు నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్‌బాబు, ట్రాన్స్‌కో గ్రిడ్ డైరెక్టరు ఎవికె భాస్కర్, ఎస్‌పిడిసిఎల్ కె సంతోషరావు తదితరులు పాల్గొన్నారు.

వరద నేపథ్యంలో పంటు రాకపోకలు నిలిపివేత

ప్రజాశక్తి-నరసాపురం (పశ్చిమగోదావరి జిల్లా)

నరసాపురం మండలం మాధవాయిపాలెం - కోనసీమ జిల్లా సఖినేటిపల్లి రేవులో ఇరు జిల్లాల మధ్య తిరిగే పంటు రాకపోకలు ఆదివారం మధ్యాహ్నం నుండి అధికారులు నిలిపివేశారు. ముందస్తు జాగ్రత్తలో భాగంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు పంటును నిలిపివేసినట్లు నరసాపురం ఇన్‌ఛార్జి ఎంపిడిఓ కె వీరభద్రరావు తెలిపారు. గోదావరిలో వరద తాకిడి తగ్గిన తర్వాత తిరిగి రాకపోకలను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. నరసాపురం నుంచి అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి లంక గ్రామాల ప్రజలు నరసాపురం వచ్చేందుకు, నరసాపురం నుంచి సఖినేటిపల్లి వైపు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తిరిగి చించినాడ బ్రిడ్జి నుండి కోనసీమ జిల్లాకు వెళ్తున్నారు.

ఉద్యోగాలు ఉత్తమాటే

(మొదటి పేజీ తరువాయి)

భూములిచ్చారు. 2011 కృష్ణపట్నంలో ప్రభుత్వ భూమి సర్వే నెం 455, 459లో 590 ఎకరాలిచ్చారు. అదే గ్రామంలో సర్వే 440, 755 వరకు 46 ఎకరాలు, 2011లో ఈపూరులో ప్రభుత్వ భూమి సర్వే 532 లో 66 ఎకరాలు, ముత్తుకూరులో పట్టా భూమి 2011లో సర్వే 532, 533, 539లో 103 ఎకరాలు, తమ్మిన పట్నంలో పట్టా భూమి సర్వే 780,781లో 107 ఎకరాలు, 2010లో కృష్ణపట్నంలో ప్రభుత్వ భూమి సర్వే 416, 699, 711, 756లో సుమారు 1000 ఎకరాలు, మరోచోట సర్వేనెం 374, 381, 383లో మరో 139 ఎకరాలు తీసుకున్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అప్పటి పోర్టు యాజమాన్యం చెప్పడంతో ఈ భూములను అప్పటి ప్రభుత్వం అప్పగించింది. ఎకరా భూమిని కేవలం రూ.64 వేలకు కూడా పోర్టుకు కేటాయించారు.

అదాని చేజిక్కించుకున్న తరువాత...

2020లో ఈ పోర్టుకు అదాని తీసుకున్నారు. ఆ తరువాత ఇక్కడ ఉన్న కంటైనర్ టెర్మినల్‌ను ఇక్కడి నుండి తరలించారు. దీనికోసం ఉపయోగించిన వందలాది ఎకరాల భూమి ప్రస్తుతం ఖాళీగా ఉంది. కంటైనర్ టెర్మినల్‌కు అనుబంధంగా వచ్చిన అనేక పరిశ్రమలు కూడా మూతపడ్డాయి. దీంతో కొత్త ఉద్యోగాలు వచ్చే సంగతి ఎలా ఉన్నప్పటికీ, ఇప్పటికే ఉన్న వేలాది ఉద్యోగాలు ఊడాయి. టెర్మినల్ కోసం నిర్మించిన మిర్చియార్డ్, గోదాములు, వివిధ రకాల భవనాలు నిరుపయోగంగా మారాయి. ఒకప్పుడు అనేక రకాల ఉత్పత్తులను ఎగుమతి, దిగుమతులు చేసిన కృష్ణపట్నం పోర్టు ప్రస్తుతం బొగ్గు, ఇనుప ఖనిజాలకు మాత్రమే పరిమితమైంది. వివిధ అవసరాలకోసం కేటాయించిన వేలాది ఎకరాల భూమి నిరుపయోగంగా మారింది. దీంతో, భూములను అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని, లేని పక్షంలో రైతులకు స్వాధీనం చేయాలన్న డిమాండ్ ముందుకు వస్తోంది. ఇటీవల స్థానిక ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇదే విషయాన్ని పోర్టు యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే వారు సమాధానం ఇవ్వలేక నీళ్లు నమిలారు. ప్రస్తుతం భూములను కాపాడుకునే పనిలో అదాని గ్రూపు యాజమాన్యం ఉన్నట్లు సమాచారం.

ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటాం..

- పెదవాగు ప్రాజెక్టు వరద ముంపు బాధితులకు సిపిఎం బృందం భరోసా
- వేలేరుపాడు మండలంలో దెబ్బతిన్న గ్రామాల్లో పర్యటన
- పంటలు, ఇళ్లు కోల్పోయి రోడ్డున పడ్డామంటూ బాధితుల ఆవేదన
- తక్షణ సాయంగా రూ.పదివేలు ఇవ్వాలి : సిపిఎం



పెదవాగు ప్రాజెక్టు సర్వంకోల్పోయిన అల్లూరి నగర్ వాసులతో మాట్లాడుతున్న సిపిఎం బృందం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటాం..ప్రభుత్వం ఆదుకునే వరకూ అన్ని రకాల ఒత్తిళ్లు తీసుకొస్తాం' అని సిపిఎం నేతలు వరద బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడి తీవ్రంగా నష్టపోయిన వేలేరుపాడు మండలంలోని గ్రామాల్లో సిపిఎం బృందం ఆదివారం పర్యటించింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, రాష్ట్ర నాయకులు ఎం.హరిబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా నాయకుల బృందం వేలేరుపాడు మండలంలోని అల్లూరి నగర్, కోయమాధవరం, మద్దిగట్ల గ్రామాల్లో పర్యటించి బాధితులను కలిసి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు కొంజె సుజాత, ముత్యాల సీత, సరెద్దుల రత్తమ్మ, రామ్మూర్తి మాట్లాడుతూ.. ప్రాజెక్టుకు గండిపడటంతో రాత్రికి రాత్రే ఊళ్లన్నీ జలమయమయ్యాయని వాపోయారు. ఇళ్లు, ఇంట్లో సామాన్లు కొట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరి, పత్తి, మిరప పంటల కోసం వేసిన నారుమడులు పూర్తిగా ధ్వంసమయ్యాయని, పొలాల్లో పెద్దఎత్తున ఇసుక మేటలు వేయడంతో ఇప్పట్లో భూములు పంటకు పనికిరాకుండా పోయిన పరిస్థితి నెలకొందని తెలిపారు. అల్లూరినగర్‌లో 85 ఇళ్లకుగాను 45 ఇళ్లు కొట్టుకుపోయాయన్నారు. పునరావాస కేంద్రం దూరంగా ఉండడంతో అక్కడకు వెళ్లలేక దెబ్బతిన్న ఇళ్లలోనే తలదాచుకుంటున్నామని తెలిపారు. కోయమాధవరం, మద్దిగట్ల గ్రామంలో బాధితులూ తమ గోడు వెళ్లబోసుకున్నారు. జోరువానలోనూ బృందం పర్యటన కొనసాగింది. ఈ సందర్భంగా సీతారాం స్పందిస్తూ బాధితులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మహా విపత్తుకు గత ప్రభుత్వాల తప్పిదమే కారణం : మంతెన సీతారామ్

జంగారెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ.. వేలేరుపాడు మండలంలోని 15 గ్రామాల్లో మహా విపత్తు సంభవించిందన్నారు. ముమ్మాటికీ గత ప్రభుత్వాల తప్పిదాల కారణంగానే ప్రాజెక్టుకు గండిపడిందని తెలిపారు. ప్రాజెక్టు తెలంగాణ ప్రాంతంలో ఉన్నప్పటికీ సాగు భూములు అత్యధికంగా ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టు కింద 16 వేల ఎకరాలు సాగు భూమి ఉండగా 13,463 ఎకరాలు మన రాష్ట్రంలో, 2,360 ఎకరాలు తెలంగాణలో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు మెయింటెనెన్స్‌కు మన రాష్ట్రం 85 శాతం, తెలంగాణ 15 శాతం భరించాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇప్పుడు ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. దాదాపు రెండు వేల కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయన్నారు. గండిపడిన సమయంలో గోదావరికి వరద లేదని, లేకుంటే తీవ్ర ప్రాణ నష్టం జరిగేదని తెలిపారు. యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టును పునఃనిర్మించాలని కోరారు. పునరావాస శిబిరాలు కొనసాగించడంతోపాటు, టార్పాలిన్లు, నిత్యావసర వస్తువులు, పాత్రలు, బట్టలు, గ్యాస్ సిలిండర్లు అందించాలని, ప్రతి కుటుంబానికీ తక్షణ సాయం కింద రూ.పదివేలు అందించి, వెంటనే నష్టం అంచనాలు తేల్చి పరిహారం ఇవ్వాలని కోరారు. ఇళ్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికీ పక్కా ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర నాయకులు ఎం.హరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే జనానికి అండగా ఉండే చర్యలు చేపట్టాలన్నారు. సిపిఎం జిల్లా నాయకులు డిఎన్‌విడి ప్రసాద్, తెల్లం రామకృష్ణ, తెల్లం దుర్గారావు, మొడియం నాగమణి, మడివి దుర్గారావు, ధర్ముల రమేష్, యర్రంశెట్టి నాగేంద్రరరావు ఇతర నాయకులు పాల్గొన్నారు.



స్వర్ణాల చెరువు వద్ద ఉన్న భక్తులు

ముగిసిన రొట్టెల పండుగ

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నెల్లూరులో బారా షాహీద్ రొట్టెల పండుగ ఆదివారంతో ముగిసింది. చివరి రోజుకూడా భారీగా జనం తరలివచ్చారు. స్వర్ణాల చెరువులో రొట్టెలు మార్చుకుని షహీదులను దర్శనం చేసుకున్నారు. ఐదు రోజుల్లో సుమారు 10 లక్షల మందికి పైగా భక్తులు దర్గాను దర్శించుకున్నారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్‌పి కృష్ణ కాంత్, జెసి సేతుమాధవన్, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ శర్మ, వివిధ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అన్ని చర్యలు తీసుకున్నారు.పోలీసులు భారీ బందోభస్తు ఏర్పాటు చేశారు.

పండుగకు ముందు నుంచే మంత్రులు నారాయణ, ఆనం రామ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఏర్పాట్లపై ప్రత్యేక దష్టి సారించారు.

కిడ్నీ వ్యాధితో ఇద్దరు మృతి



ప్రజాశక్తి- గంపలగూడెం (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లా గంపలగూడెం మండలం అనుములంకలో కిడ్నీ వ్యాధితో మరణాలు ఆగడం లేదు. గ్రామంలోని దళితవాడకు చెందిన ఇద్దరు ఈ వ్యాధితో ఆదివారం మృతి చెందారు. వారిలో కనకపూడి భారతి (58), కనకపూడి దాస్ (52) ఉన్నారు. కొంతకాలంగా వారు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. చికిత్స పొందుతున్నా ప్రయోజనం లేకపోయింది. కూలి పనులు చేసుకొని బతుకున్న వారిని కిడ్నీ వ్యాధి కబళించింది. దాసుకు భార్య, ముగ్గురు పిల్లలు, భారతికి భర్త, ఒక కుమారుడు ఉన్నారు. వీరి మృతదేహాలను ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మద్దిరెడ్డి వెంకటరెడ్డి, పలువురు గ్రామ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఆ గ్రామంలో కొన్ని సంవత్సరాలుగా కిడ్నీ మరణాలు కొనసాగుతున్నాయి. గత నాలుగేళ్లలో 25 మందికిపైగా ఈ వ్యాధితో మృతి చెందినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కృష్ణా నది నుండి నీటిని పైపులైన్ ద్వారా తెచ్చి తాగునీటి సమస్య పరిష్కరిస్తామని, కిడ్నీ వ్యాధులు ప్రబలకుండా చూస్తామని ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. దీంతో, సిపిఎం ఆధ్వర్యంలో గ్రామస్తులు పలుమార్లు ఉద్యమించారు. తాత్కాలిక వైద్యమే తప్ప, శాశ్వత పరిష్కారానికి పాలకులు కృషి చేయడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం స్పందించి కిడ్నీ వ్యాధి నివారణకు వెంటనే శాశ్వత చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సమాన పనికి సమాన వేతనం

- అమలు చేయాలని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ జెఎసి తీర్మానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, పార్ట్‌టైం, గెస్ట్, కంటింజెంట్ తదితర ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్ అండ్ వర్కర్స్ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ విధానం అమలు చేసేలోపు మినిమం టైంస్కేల్ (ఎంటిఎస్) విధానం, డైరెక్ట్ పేమెంట్ అమలు, రెగ్యులరైజేషన్ చేయాలని కోరింది. అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని తీర్మానించింది. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో జెఎసి సమావేశం ఆదివారం జరిగింది. జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను గత ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. అందర్నీ రెగ్యులరైజ్ చేస్తామని చెప్పి 10,717 మందికి మాత్రమే ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. వీరిలోనూ ఏడు వేల మందిని రెగ్యులరైజ్ చేయలేదని పేర్కొన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాన్ని తగ్గిస్తూ జిఓ 7ను జారీ చేసిందని, దీనివల్ల లక్షల మంది ఉద్యోగులకు అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వారి కుటుంబ సభ్యులలో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు కొనసాగించాలని కోరారు. ఉద్యోగుల రిటైర్మెంట్ 62 ఏళ్లకు పెంచాలని తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్, సమగ్రశిక్షా తదితర ప్రభుత్వ పథకాల్లోని ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేసి డిఎ సౌకర్యం కల్పించాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐ, ఆరోగ్యబీమా వర్తింపజేయాలని పేర్కొన్నారు. 2014లోపు ఉద్యోగంలో చేరిన వారిని రెగ్యులరైజ్ చేస్తూ ఉత్తర్వులివ్వాలని, ఆ తరువాత చేరిన వారిని రెగ్యులరైజ్ చేసేందుకు నిర్దిష్ట విధానాన్ని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా మొదటి వారంలో వేతనాలు ఇవ్వాలని, వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎస్ఎ జెఎసి సెక్రటరీ జనరల్, పి వెంకటసుబ్బయ్య, వెలుగు విఓఎ ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి, జెఎసి నాయకులు రజిని, ఎం బుజ్జి, చంద్రశేఖర్, రమేష్, నారాయణమ్మ, ఎ నాగరాజు, శ్రీనివాస్, చంద్రపాల్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీడీ కార్మిక సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ జి ఓబులు

బీడీ కార్మికుల సంక్షేమబోర్డు పునరుద్ధరణ

- నిధులు కేటాయించాలి
- ప్రభుత్వానికి సమన్వయ కమిటీ విజ్ఞప్తి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బీడీ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరణ చేసి సంక్షేమానికి నిధులు కేటాయించాలని బీడీ కార్మికుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ జి ఓబులు ప్రభుత్వాన్ని కోరారు. కర్నూలు జిల్లా కార్మిక కర్షక భవన్‌లో ఆదివారం బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కో కన్వీనర్ ఎస్ ఇక్బాల్ హుస్సేన్ అధ్యక్షతన బీడీ కార్మికుల రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఓబులు మాట్లాడుతూ రాష్ట్రంలో బీడీ కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల ఫలితంగా కార్మికులు అనేక హక్కులను కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నాయన్నారు. జిఎస్‌టి పేరుతో బీడీ కార్ఖానాలపై భారం వేయడం వల్ల ఆయా యజమానులు కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలు ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలను కల్పించలేకపోతున్నారని తెలిపారు. కార్మికులకు ఉచిత వైద్య సదుపాయం పేరుతో జిల్లాలో పెట్టిన ఆస్పత్రిలో వైద్యులు, మందులు అందుబాటులో ఉండడం లేదన్నారు. కార్మికులు పనిచేసే ప్రదేశాలలో వైద్య సేవలు అందే విధంగా మెడికల్ మొబైల్ వ్యాన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీడీ తయారీ చేయడం వల్ల కార్మికులకు టిబి, క్షయ, కేన్సర్ వంటి అనేక వ్యాధులకు గురికావలసి వస్తోందని, కొంత మంది చనిపోయిన సందర్భాలూ ఉన్నాయని అన్నారు. బీడీ కార్మికులకు ఉచిత వైద్యం సదుపాయం, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం, స్కాలర్ షిప్‌లు, యజమానుల ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. తెలంగాణా మాదిరిగా నెలకు రూ. మూడు వేల పింఛన్లు ఇవ్వాలని, ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీడీ కార్మికుల సమన్వయ కమిటీ కోకన్వీనర్‌గా ఉన్న చైతన్య స్థానంలో కర్నూలు నుండి ఎస్ ఎక్బాల్ హుస్సేన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిఐటియు కర్నూలు జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు, షబ్బీర్, షంశాద్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యసాయి, జగన్‌మోహన్, బాబుఖాన్, రసూల్‌ఖాతూన్, కమ్రూన్, రబియాబీ తదితరులు హాజరయ్యారు.

రాష్ట్ర హక్కుల కోసం నిలబడాలి

(మొదటి పేజీ తరువాయి)

గొడవలు ఉంటే అసెంబ్లీలో చర్చించాలని సూచించారు. జగన్ అందుకు భిన్నంగా ఢిల్లీలో ధర్నా అంటున్నారన్నారు. రాష్ట్ర హక్కులపై ఢిల్లీలో ధర్నా చేస్తే మేలు జరుగుతుందని సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లోనూ అన్ని రకాల సమస్యలపై చర్చించి వాటికి పరిష్కారాలు లభించేలా చూడాలని కోరారు. ప్రజలు చాలా ఆకాంక్షలతో ఉన్నారన్నారు. గత నాలుగేళ్లలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.61,500 కేటాయిస్తే రూ.32 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. గత పదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులపై పాలకులకు చిత్తశుద్ధి కొరవడిందని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని జంఝావతి ప్రాజెక్టుపై కేవలం 150 మీటర్ల స్థల వివాదం వల్ల 3.5 టిఎంసిల నీటిని రైతులు వాడుకోకుండా వదిలేయాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రంలో 90 శాతం పూర్తయిన ప్రాజెక్టులకు కొద్దిపాటి నిధులు కేటాయిస్తే రైతులకు పూర్తిగా వినియోగంలోకి వస్తాయని తెలిపారు. ఇలాంటివి 10 నుంచి 15 వరకూ ఉన్నాయని వివరించారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం ఇవ్వకుండానే ప్రాజెక్టును గత అక్టోబరులో జగన్ ప్రారంభించారన్నారు. కాలువలూ పూర్తి కాలేదని తెలిపారు. దీనివల్ల ఎవరికీ ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అదిగోఇదిగో ప్రారంభం అంటూ ముహూర్తాలతోనే కాలయాపన చేశారని తెలిపారు. నిర్వహణకు కూడా నిధులు ఇవ్వనందున ప్రాజెక్టులు అధ్వానంగా మారాయన్నారు. వెనుకబడిన ప్రకాశం వంటి జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీలు ఇవ్వాలని, ప్రకాశం జిల్లాకు రూ.10 వేల కోట్లు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె.మాబు, కంకణాల ఆంజనేయులు పాల్గొన్నారు.

దాడులపై కేంద్ర సంస్థలతో విచారణ

- గవర్నర్‌కు వైఎస్ జగన్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం దాడులపై కేంద్ర సంస్థలతో విచారణ జరిపించాలని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాజ్‌భవన్‌లో ఆదివారం సాయంత్రం గవర్నరుతో భేటీ అయ్యారు. వీరి మధ్య భేటీ సుమారు అరగంటకు పైగా సాగింది. ఈ సందర్భంగా గవర్నరుకు జగన్ పలు అంశాలపై వివరించారు. ఇందుకు సంబంధించి వినతిపత్రాన్ని అందజేశారు. యథేచ్ఛగా హత్యలు, దాడులు, ఆస్తుల విధ్వంసం కొనసాగుతోందని, తమ పార్టీని అణగదొక్కడమే ప్రభుత్వ లక్ష్యంగా కనబడుతోందని జగన్ పేర్కొన్నారు. కూటమి పాలనలో 36 మంది హత్యకు గురయ్యారని, 300 మందికిపైగా హత్యాయత్నాలు, టిడిపి వేధింపులు భరించలేక మరో 35 మంది ఆత్మహత్య చేసుకున్నారన్నారు. 1050కు పైగా దౌర్జన్యాలు, దాడులు, 2,700 కుటుంబాలు ఊళ్లు విడిచి వెళ్లిపోయాయని అన్నారు. వినుకొండలో తమ పార్టీ కార్యకర్త రషీద్‌ను దారుణంగా హత్య చేశారని, ఆ ఘటన రాష్ట్ర ప్రజానీకాన్ని తీవ్ర కలవరపాటుకు గురిచేసిందని అన్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో మాజీ ఎంపి రెడ్డప్పను పరామర్శించడానికి వెళ్లిన ఎంపి మిథున్‌రెడ్డిపై టిడిపి మూకలు రాళ్లదాడి చేశాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని, సంఘ విద్రోహ శక్తులు పెట్రేగిపోతున్నాయని వివరించారు. సుమారు 27 మంది ఐఎఎస్, 24 మంది ఐపిఎస్‌లకు పోస్టింగులు ఇవ్వకుండా చేశారంటే చంద్రబాబు లక్ష్యాలు, ఉద్దేశాలు కళ్లముందే కనిపిస్తున్నాయన్నారు.

జగన్‌వి తప్పుడు ఆరోపణలు : హోంమంత్రి అనిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పరామర్శ పేరుతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ హత్యలు, హత్యాయత్నాలపై అబద్ధాలు చెబుతున్నారని, వీటికి సంబంధించిన వివరాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే తప్పుడు ఆరోపణల నేపథ్యంలో జగన్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజల్లో విషపు బీజాలు నాటడానికి జగన్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజల్లో భయాన్ని సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన నాలుగు రాజకీయ హత్యల్లో ముగ్గురు టిడిపి నాయకులే చనిపోయారని వివరించారు. ఐదేళ్ల వైసిపి పాలనలో జరిగిన ఘోరాలపై జగన్ ఏనాడూ మాట్లాడలేదన్నారు. అసెంబ్లీకి వస్తే తన బండారం బయటపడుతుందనే ఢిల్లీలో ధర్నా అంటూ జగన్ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. చిన్నపిల్లలపై అఘాయిత్యాలు గంజాయి, మద్యం మత్తులోనే ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టడానికి ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎస్‌పితోపాటు తాను కూడా బడిపిల్లలతోపాటు ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అత్యాచారాలపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసి ఘటనలను పూర్తిగా అరికడతామన్నారు.

ముచ్చుమర్రి లాకప్‌డెత్‌పై న్యాయ విచారణ

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలోని బాలికపై అత్యాచారం చేసి చంపి కాలువలో పడేసిన కేసులో నిందితుడైన యోహాన్ లాకప్‌డెత్‌పై న్యాయ విచారణ జరిపించాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు హోంమంత్రి, ఎస్‌సి కమిషన్ ఛైర్మన్‌కు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి ఆదివారం వినతిపత్రం అందజేశారు. అత్యాచారం కేసులో యోహాన్‌ను పోలీసులు విచారణ పేరుతో నందికొట్కూరు నుంచి మిడుతూరుకు అక్కడ నుంచి నంద్యాల సిసిఎస్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి హింసించడం వల్లే మృతిచెందినట్లు అతని శరీరంపై వున్న గాయాలను బట్టి అర్థమవుతోందని అన్నారు. నిందితుడు జీపు నుంచి దూకి పరిగెత్తడం వల్లే హార్ట్ ఫెయిల్యూర్ అయిందని పోలీసులు చెబుతున్న మాటలు నమ్మశక్యంగా లేవన్నారు. మృతుడిని బంధువులకు అప్పగించకుండా, మీడియాకు కూడా చూపకుండా ఇతరులను అనుమతించకుండా రహస్యంగా అంత్యక్రియలు ఎందుకు జరిపారని ప్రశ్నించారు. ముచ్చుమర్రి ఘటన తీవ్రమైందేనని, అయితే పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా రాజ్యాంగబద్ధంగా విచారణ చేయాల్సిందని అన్నారు. దళితుడైన యోహాన్‌పై పోలీసులు చేసిన ఈ దారుణంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.



.వరద బాధితులతో మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - వేలేరుపాడు (ఏలూరు జిల్లా)

వరద బాధితులకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని అల్లూరి నగర్, మేడేపల్లి, మాదారం, ఉదయ్ నగర్ తదితర గ్రామాల్లో వరద బాధితులను సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆదివారం పరామర్శించారు.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణలోని పెదవాగు ప్రాజెక్టు వరదతో మన రాష్ట్రంలోని సుమారు 20 గ్రామాలు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అనేక చోట్ల రహదారులు తెగిపోవడం, విద్యుత్ స్తంభాలు పడిపోవడం వలన బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి దుర్భరమైన జీవనం సాగించారన్నారు. గత పాలకులు సరైన క్రమంలో ప్రాజెక్టుల మరమ్మతులు చేపట్టినట్టయితే ఇంతటి నష్టం జరిగేది కాదన్నారు. భారీ వర్షాలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మేడేపల్లి ప్రాంతంలో పునరావాస కేంద్రాన్ని సందర్శించి వారికి కల్పించిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. రుద్రంకోట వద్ద వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు పాల్గొన్నారు.

నూతన క్రిమినల్ చట్టాలు హానికరం

- యుటిఎఫ్ రాష్ట్ర సదస్సులో రమేష్ బాబు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన క్రిమినల్ చట్టాలు సమాజానికి హానికరమైనవని ఐలు జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్.రమేష్ బాబు అన్నారు. 'నూతన క్రిమినల్ చట్టాలు - పర్యవసానం', 'ప్రత్యామ్నాయ విద్యా విధానం' అనే అంశాలపై యుటిఎఫ్ ఆధ్వర్యాన ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా నూతన క్రిమినల్ చట్టాలపై రమేష్ బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన క్రిమినల్ చట్టాలు ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులకు భంగకరమైనవని పేర్కొన్నారు. ఐపిసి చట్టాలను భారత సంహిత పేరుతో అమలు చేయడాన్ని గర్హిస్తున్నామని, ప్రభుత్వం చేసే ఏ చట్టాలైనా ప్రజల హక్కులను పరిరక్షించేవిగా ఉండాలేగానీ.. హక్కులను ఖననం చేసేవిగా ఉండరాదన్నారు. జ్యుడీషియల్ వ్యవస్థను తగ్గించి పోలీసులకు ప్రత్యేక అధికారాలను కట్టబెట్టేవిగా, ప్రజా ఉద్యమాలను అణచివేసేవిగా నూతన క్రిమినల్ చట్టాలు ఉన్నాయని వివరించారు. ఆ చట్టాలను నియంతృత్వంగా అమలు చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్.ప్రసాద్ ప్రత్యామ్నాయ విద్యా విధానంపై మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం క్షీణ దశకు చేరుకుంటోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలు ఒకే రకమైన సిలబస్‌ను, ఒకే రకమైన పరీక్ష విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగు, ఇంగ్లీష్ రెండు బోధనా మాధ్యమాలను ఉన్నత పాఠశాలల్లో కొనసాగించాలని కోరారు. మినిమం టైమ్ స్కేల్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, జిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుల్లో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రెడ్డి మోహనరావు, ఎస్.కిషోర్ కుమార్, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే బిఎస్‌ఎన్‌ఎల్ బలోపేతం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు



సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలని (విశాఖపట్నం)

కార్మిక పోరాటాలతోనే బిఎస్‌ఎన్‌ఎల్ బలోపేతం అవుతుందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర విస్తృత కార్యవర్గ సమావేశం ఆదివారం విశాఖ దాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల కార్మికులు ఒక్కటై పోరాడితేనే ప్రభుత్వాలపై విజయం సాధించగలమని తెలిపారు. 1991 నుంచి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలన్నీ పబ్లిక్ సెక్టార్‌ను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే పనిచేశాయని అన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పబ్లిక్ సెక్టార్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతోందని, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు జరుగుతున్న ప్రయత్నాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. అమ్మేస్తారా లేదా మూసేస్తారా అన్న అజెండాతో కేంద్రం ఉక్కు కర్మాగారంపై ముందుకు వెళ్తోందని తెలిపారు. దేశంలో ఎక్కడైతే కార్మికులు ఇబ్బంది పడ్డారో అక్కడ బిజెపి ఓడిపోయిందన్నారు. బిఎస్‌ఎన్‌ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి.ఆడమ్స్ మాట్లాడుతూ.. బిఎస్‌ఎన్‌ఎల్ సేవలను మెరుగుపరిచేందుకు ఉద్యోగులు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని తెలిపారు. దేశ వ్యాప్తంగా 4జి సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు సాంకేతిక పనులు జరుగుతున్నాయని అన్నారు. మేకిన్ ఇండియా ద్వారా నాలుగు స్వదేశీ కంపెనీలు బిఎస్‌ఎన్‌ఎల్ 4జికి సాంకేతికతను అందించనున్నాయని, ఇప్పటికే పంజాబ్‌లో పైలెట్ ప్రాజెక్టుగా బిఎస్‌ఎన్‌ఎల్ 4జిని అందిస్తున్నామని తెలిపారు. ప్రయివేటు టెలికం సంస్థలు ధరలు భారీగా పెంచిన తరుణంలో ఇప్పటికీ బిఎస్‌ఎన్‌ఎల్ రూ.వెయ్యిలోపు సంవత్సర చందా కలిగిన ప్లాన్లు అందిస్తోందని వివరించారు. 4జి సేవలు అందుబాటులోకి వస్తే దేశంలోని 710 సెక్టార్లలో బిఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. గడిచిన నెల రోజుల్లో విశాఖపట్నం జిల్లాలో ఏడు వేల మంది బిఎస్‌ఎన్‌ఎల్‌కు పోర్ట్ ద్వారా మారారని వెల్లడించారు. బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ సర్కిల్ నాయకులు పి.అచ్చిరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సర్కిల్ కార్యదర్శి కె.రమాదేవి, జిల్లా కార్యదర్శి సాగర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎంఎస్.శ్రీనివాస్, కోశాధికారి బి.లక్ష్మీనారాయణ, నాయకులు రామాంజనేయులు, మూర్తి, ఎస్.మంజుల పాల్గొన్నారు.

రాయితీపై నిత్యావసర సరుకులు

- మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతు బజార్లలో రాయితీపై నిత్యావసర సరుకులు అందిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి రాయితీపై నాణ్యమైన కందిపప్పు, బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. ఎ గ్రేడ్ కందిపప్పు కిలో రూ.160, రెండు రకాల నాణ్యమైన సోనా మసూరి బియ్యాన్ని కిలో రూ.48, రూ.49లకు ప్రజలకు అందిస్తున్నామన్నారు. ఒంగోలులోని మూడు రైతు బజార్లతో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లోని రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. వైసిపి హయాంలో పెరిగిన నిత్యావసర ధరలతో పేదలు, అర్ధాకలితో అలమటించారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు కూడా ఏర్పాటుచేసి రూ.5లకే పేదల ఆకలి తీరుస్తామని పేర్కొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


బోయ గుడిసె రంగన్న(ఫైల్)

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. రైతు కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. ఎమ్మిగనూరు మండల పరిధిలోని కె తిమ్మాపురం గ్రామానికి చెందిన బోయ గుడిసె రంగన్న (39) రెండెకరాలు సొంత భూమితో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. సాగు నిమిత్తం సుమారు ఐదు లక్షల వరకూ అప్పు చేశారు. పంటలు పండక, పండిన పంటకు గిట్టుబాటు ధర లేక వ్యవసాయ పెట్టుబడికి చేసిన అప్పులు తీర్చలేక మనోవేదనకు గురయ్యారు. శనివారం రాత్రి సమయంలో ఆయన సొంత వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. గమనించిన గ్రామస్తులు ఆయనను ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. ఆదివారం చికిత్స పొందుతూ రంగన్న మృతి చెందారు. ఆయనకు భార్య లక్ష్మి, కుమారుడు జానకిరాముడు, కుమార్తె మంజుల ఉన్నారు. ఎమ్మిగనూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్దతు ధరల గ్యారంటీకి చట్టం

- కేంద్ర మంత్రిని కోరిన సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు


మంత్రి రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ప్రభుత్వం అన్ని పంటలకు మద్దతు ధరల గ్యారంటీకి చట్టం చేసి రైతాంగ ఆత్మహత్యలు నివారించాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ తాండ్ర ప్రకాష్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెలమల రమణ, పోలాకి ప్రసాదరావు కోరారు. ఢిల్లీలో రైతు ఉద్యమం సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుని శ్రీకాకుళంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2020-21 రైతు ఉద్యమం సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాతపూర్వక హామీలు ఇచ్చిందని, వాటి అమలుకు ఇంత వరకు చర్యలు తీసుకోలేదని గుర్తు చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అన్ని పంటలకు మద్దతు ధరల చట్టం చేసి అమలు చేయాలని... రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణ విముక్తి కలిగించాలని విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, విద్యుత్ ప్రయివేటీకరణ చట్టం రద్దు చేయాలని కోరారు. రైతులు, వ్యవసాయ కార్మికులందరికీ ప్రతినెలా రూ.10 వేలు పింఛను ఇవ్వాలని, భూసేకరణ చట్టం-2013ను అమలు చేయాలన్నారు. ఏటా పెరిగే భూమి ధరలకు అనుగుణంగా ప్రాజెక్టులు, ప్రభుత్వ, ప్రయివేటు అవసరాలకు, భూ సమీకరణకు భూమి కోల్పోయిన వారికి పునరావాసం కల్పించి, న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు సబ్సిడీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి జిడిపి వాటాతో ప్రత్యేక కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని తెలిపారు. చారిత్రక రైతాంగ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన రైతులకు, లఖింపూర్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రైతుల కుటుంబాలకు న్యాయమైన నష్ట పరిహారం అందించాలని, రైతులపై పెట్టిన కేసులన్నీ ఉపసంహరించుకునేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్ (ప్రకాశం జిల్లా), డెంకాడ (విజయనగరం జిల్లా)

ప్రకాశం, విజయనగరం జిల్లాల్లో ఆదివారం జరిగిన వేర్వేరు ఘోర రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మరణించారు. పదిమంది గాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుండి ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు 35 మంది ప్రయాణికులతో అనంతపురానికి బయలుదేరింది. ఆదివారం తెల్లవారుజామున ప్రకాశం జిల్లా మర్కాపురం మండల పరిధి తిప్పాయపాలెం గ్రామ సమీపంలోని జాతీయ రహదారి 544-డిపై అడ్డుగా ఉన్న గేదెల గుంపును ఢీకొని బస్సు బోల్తా పడింది. దీంతో అనంతపురం జిల్లా ధర్మవరం చెందిన గజ్జల శివయ్య (42), విజయవాడకు చెందిన కుర్ర విజయలక్ష్మి (52) మృతి చెందారు. మూడు గేదెలూ చనిపోయాయి. హైవే రెస్క్యూ టీం ఘటనాస్థలానికి చేరుకొని గాయాలైన ముగ్గురు ప్రయాణికులను మార్కాపురం సర్వజన ఆస్పత్రికి తరలించింది. రోడ్డుపై అడ్డంగా ఉన్న బస్సును క్రేన్ల సాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

విజయనగరం నుంచి విశాఖ వైపు వెళ్తున్న వ్యాను డెంకాడ మండలం జొన్నాడ వద్ద జాతీయ రహదారి-26పైకి వచ్చేసరికి సైకిలిస్టును ఢీకొంది. అక్కడకి దగ్గర్లో ఉన్న కారు వద్ద నిలబడిన గుంటూరుకు చెందిన నవీన్ చందు (34)నూ ఢీకొట్టి, అనంతరం డివైడర్‌ను ఢీకొని వ్యాను బోల్తా పడింది. దీంతో నవీన్ చందు, వ్యానులో ఉన్న పూసపాటిరేగ మండలం గుంపాం గ్రామానికి చెందిన బాడితిబోయిన సన్యాసి (58) మృతి చెందారు. పది మందికి గాయాలయ్యాయి.

జనసేన ఆర్థిక భరోసా

- 81 కుటుంబాలకు రూ.4.5 కోట్ల బీమా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కార్యకర్తల క్షేమం గురించి ఆలోచించే నాయకుడు పవన్‌కల్యాణ్ అని జనసేన ప్రధాన కార్యదర్శి కె నాగబాబు పేర్కొన్నారు. ఇటీవల వేర్వేరు ప్రమాదాల్లో మరణించిన జనసేన క్రియాశీలక సభ్యులు 81 మంది కుటుంబాలకు రూ.4.5 కోట్ల బీమా చెక్కులను మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ.. అబద్ధాలు చెప్పడంలో జగన్‌కు డాక్టరేట్ ఇవ్వొచ్చని, వైసిపి ప్రభుత్వంలో అవినీతి చేసిన ఏ ఒక్కరూ చట్టం నుంచి తప్పించుకోలేరని అన్నారు. జనసేన ఎమ్మెల్సీ పి హరిప్రసాద్ మాట్లాడుతూ.. ఆపత్కాలంలో కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలవాలన్న లక్ష్యంతో పవన్‌కల్యాణ్ క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు.

బాలికపై అత్యాచారం

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో : పదేళ్ల బాలికపై అత్యాచారం సంఘటన చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలో ఆదివారం వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. ముప్పిరెడ్డిగారిపల్లెకు చెందిన దంపతులు శనివారం రోజూలాగే కూలి పనులకు వెళ్లారు. ఆడుకోవడానికి వెళ్లిన వీరి కుమార్తెకు మాయమాటలు చెప్పి అదే గ్రామానికి చెందిన రెడ్డి హుస్సేన్ (26) సమీపంలోని మామిడి తోటలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో నిందితుడిపై పోక్సో కింద పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రేపటి నుంచి ఇఎపిసెట్ తుది దశ కౌన్సెలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా ఉమ్మడి ప్రవేశ పరీక్ష (ఇఎపిసెట్)-2024 తుది దశ కౌన్సెలింగ్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపు ఈ నెల 23 నుంచి 25 వరకు జరగనుంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ 23 నుంచి 26వ తేదీ వరకు, ఆప్షన్ల నమోదు 24 నుంచి 26వ తేదీ వరకు ఉంటుంది. 27న ఆప్షన్లు మార్చుకునే వెసులుబాటు ఉంది. ఈ నెల 28 నుంచి 30 వరకు సీట్ల కేటాయింపు ఉంటుంది. ఆగస్టు 3వ తేదీలోపు సీట్లు పొందిన అభ్యర్థులు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాలి. తొలి దశ కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు ఈ నెల 22లోపు కళాశాలల్లో రిపోర్టు చేయకపోతే సీట్లు రద్దు చేస్తామని కౌన్సెలింగ్ ఛైర్మన్ నవ్య వెల్లడించారు.


టిడిపి, జనసేనల్లోకి చేరిన కార్పొరేటర్లతో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, కూటమి ఎమ్మెల్యేలు

విశాఖలో వైసిపికి ఎదురుదెబ్బ

- టిడిపిలో ఏడుగురు, జనసేనలో ఐదుగురు కార్పొరేటర్లు చేరిక

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి)లో వైసిపికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తాజాగా 12 మంది కార్పొరేటర్లు వైసిపిని వీడారు. టిడిపిలో ఏడుగురు, జనసేనలో ఐదుగురు చేరారు. ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఆ కార్పొరేటర్లకు కండువా కప్పి టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీలోకి చేరిన వారిలో సారిపల్లి గోవింద్, కంపా హనోక్, బొడ్డు నరసింహపాత్రుడు, ఇల్లపు వరలక్ష్మి, లొడగల అప్పారావు, రాజాన రామారావు ఉన్నారు. జనసేనలోకి చేరిన వారిలో ఆళ్ల లీలావతి, కంటిపాము కామేశ్వరి, పెద్దిశెట్టి ఉషశ్రీ, బి.సూర్యకుమారి, పి.పూర్ణశ్రీ ఉన్నారు. ఇలా ఒక్కసారిగా కార్పొరేటర్లంతా బయటకు వెళ్లడంతో వైసిపికి ఊహించని షాక్ తగిలినట్లయింది. కార్యక్రమంలో విశాఖ ఎంపి శ్రీ భరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్ పాల్గొన్నారు.

నరసాపురం ఎంపిడిఒ కుటుంబానికి ఎస్‌పి పరామర్శ

ప్రజాశక్తి-కంకిపాడు (పశ్చిమగోదావరి జిల్లా)

గత కొద్ది రోజుల క్రితం అదృశ్యమైన పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎంపిడిఒ మండల వెంకట రమణారావు కుటుంబాన్ని కృష్ణా జిల్లా ఎస్‌పి ఆర్ గంగాధర్‌రావు ఆదివారం పరామర్శించారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరులో నివాసం ఉంటున్న ఎంపిడిఒ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అధైర్య పడవద్దని, ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదృశ్యానికి కారణాలు, ఇంకా ఏదైనా సమస్యలు ఉన్నాయేమో అని అడిగి తెలుసుకున్నారు. ఎంపిడిఒ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయని, దిగులు పడవద్దని వారికి ఎస్‌పి ధైర్యం చెప్పారు.

ఘోష్, హర్మన్‌ప్రీత్ అర్ధ సెంచరీలు

- యుఎఇపై భారత్ ఘన విజయం
- సెమీస్‌లో స్థానం ఖాయం
- మహిళా ఆసియా కప్

దంబుల్లా : ఆసియా కప్‌లో భారత అమ్మాయిలకు ఎదురు లేదు. వరసగా రెండు విజయాలతో... గ్రూప్ దశలో మరో మ్యాచ్ ఉండగానే సెమీఫైనల్ బెర్త్ లాంఛనం పూర్తి చేసుకున్నారు. గ్రూప్ దశలో ఇప్పటికే పాకిస్థాన్‌పై విజయం సాధించిన భారత్ ఆదివారం 78 పరుగుల తేడాతో యుఎఇని చిత్తు చేసింది. ముందుగా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత అమ్మాయిలు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 201 పరుగుల భారీ స్కోరు సాధించారు. వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్ (64 నాటౌట్, 29 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (66, 47 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. షెఫాలీ వర్మ (37, 18 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ ఇన్నింగ్స్‌తో మెరిసింది. రిచా ఘోష్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది. రిచా ఘోష్, హర్మన్‌ప్రీత్ కౌర్ ధనాధన్ ఇన్నింగ్స్‌లతో పొట్టి ఫార్మాట్‌లో భారత మహిళల జట్టు తొలిసారి 200 పరుగుల మార్క్ అందుకుంది. స్పిన్నర్ దీప్తి శర్మ (2/23) మాయకు రాధ యాదవ్, తనూజ కన్వార్ జోరు తోడవటంతో ఛేదనలో యుఎఇ తేలిపోయింది. 20 ఓవర్లలో 7 వికెట్లకు 123 పరుగులే చేసింది. ఆల్‌రౌండర్ కవిశ (40 నాటౌట్, 32 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), ఓపెనర్ ఇషా ఓజా (38, 36 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించటంతో యుఎఇ గౌరవప్రద స్కోరు సాధించింది. గ్రూప్-ఎ చివరి మ్యాచ్‌లో నేపాల్‌తో భారత్ తలపడనుంది.

స్కోరు వివరాలు : భారత మహిళల ఇన్నింగ్స్ : షెఫాలీ వర్మ (సి) తీర్థ సతీశ్ (బి) ధర్నిధారక 37, స్మృతీ మంధాన (సి) రినితం రజిత్ (బి) కవిశ 13, హేమలత (బి) హీనా 2, హర్మన్‌ప్రీత్ కౌర్ (రనౌట్) 66, జెమీమా రొడ్రిగస్ (సి) రినిత రజిత్ (బి) కవిశ 14, రిచా ఘోష్ నాటౌట్ 64, పూజ వస్త్రాకర్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 05, మొత్తం : (20 ఓవర్లలో 5 వికెట్లకు) 201.

వికెట్ల పతనం : 1-23, 2-52, 3-52, 4-106, 5-181.

బౌలింగ్ : షమిర ధర్నిధారక 4-0-42-1, ఖుషీ శర్మ 1-0-15-0, కవిశ 4-0-36-2, హీనా 4-0-40-1, వైష్ణవి 3-0-28-0, ఇషా 2-0-26-0, ఇందుజ నందకుమార్ 2-0-14-0.

యుఏఈ మహిళల ఇన్నింగ్స్ : ఇషా ఓజా (స్టంప్డ్) రిచా ఘోష్ (బి) కన్వార్ 38, తీర్థ సతీశ్ (సి) హర్మన్‌ప్రీత్ (బి) రేణుక సింగ్ 4, ధర్నిధారక (సి) కన్వార్ (బి) దీప్తి శర్మ 5, కవిశ నాటౌట్ 40, ఖుషీ శర్మ (సి) మంధాన (బి) రాధ 10, హీనా (సి) షెఫాలీ (బి) దీప్తి శర్మ 8, రితిక రజిత్ (రనౌట్) 6, ఎక్స్‌ట్రాలు : 05, మొత్తం : (20 ఓవర్లలో 7 వికెట్లకు) 123.

వికెట్ల పతనం : 1-11, 2-24, 3-36, 4-76, 5-95, 6-107, 7-123. **బౌలింగ్ :** రేణుక సింగ్ 4-0-30-1, తనూజ కన్వార్ 4-0-14-1, పూజ వస్త్రాకర్ 4-1-27-1, దీప్తి శర్మ 4-0-23-2, రాధ యాదవ్ 4-0-29-1.

గంజాయి స్థావరంపై దాడి : ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-తెనాలిరూరల్ (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తెనాలిలో గంజాయి స్థావరంపై పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. రూ.2 లక్షల విలువ చేసే రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను తెనాలి డిఎస్‌పి రమేష్ ఆదివారం మీడియాకు వెల్లడించారు. కఠెవరానికి చెందిన షేక్ ఇమ్రాన్ స్థానిక జెండాజెట్టు బజారులో అద్దెకుంటున్నాడు. బాపట్ల మహాత్మాజీపురానికి చెందిన అల్లుమోల్లు మణికుమార్‌రెడ్డి, తాడిశెట్టి జోసఫ్, మంగళగిరికి చెందిన భార్గవ ప్రశాంత్, తిరువీధుల సాయికృష్ణ, ఖగ్గా తిరుపతయ్య, తెనాలికి చెందిన ఒక మైనర్‌తో కలిసి కాలేజీ విద్యార్థులకు గంజాయి విక్రయిస్తున్నాడు. అమ్మిన వారికి ఇమ్రాన్ కొంత డబ్బు ఇచ్చేవాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఇమ్రాన్ ఉండే ఇంటిపై దాడిచేసి గంజాయి సేవిస్తున్న మణికుమార్‌రెడ్డి, జోసఫ్, మైనర్‌ను పట్టుకున్నారు. ప్రధాన నిందితుడు ఇమ్రాన్, సాయికృష్ణ, తిరుపతయ్య పరారయ్యారు. నిందితులపై పిడి యాక్ట్ నమోదు చేస్తామని డిఎస్‌పి తెలిపారు.

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 22 జులై 2024



తేనె చినుకుల వాన

మనుషులంటే
అవని గర్భాన్ని పెల్లగించుకొని
ఆత్మ స్థైర్యంతో పైకెగిసే
మహీరుహాలు కదూ!
అలుపెరుగని దీక్షతో
ఆకాశానికి సాచిన
అగ్ని నాలుకలు కదూ!
కొండ శిఖరం మీంచి గుండె లోయల్లోకి
గోముగా దుమికే జలపాతాల
జింకపిల్లలు కదూ!

మరి పూటకో నాటకాన్ని
పుక్కిట పట్టిన గుంట నక్కల్ని
మనుషులని ఎట్ల అనాలి?
రోజుకో తీరుగా రంగులు
అద్దుకునే ఊసరవెల్లుల్ని
మనుషులని ఎట్ల పిలవాలి?
కొరకంచుతో చురకంటించినా
కదలిక లేని కొండల మీది బండరాళ్ళను
మనుషులుగా ఎట్ల భావించాలి?
సంక్షేమ పథకాల చిల్లర బిళ్లలకే
సంతృప్తి పడిపోయే జీవులు,
ఎవడి తలకు ఎవడో వెలను నిర్ణయిస్తే
కిక్కురునకుండా అంగట్లో
సరుకులైపోతున్న సంత పశువులు
వీళ్ళూ మనుషులేనా!

నిజంగా వీళ్ళే మనుషులైతే
పచ్చని బతుకుల్లో నిప్పులు పోసే
కర్కశ చట్టాల కొండ శిలువలన్నీ
వుండ చుట్టుకొని సాగర గర్భంలో
శిలాజాలుగా ఘనీభవించేవి కదా!
పీడిత జనాల నెత్తురు తాగే
పెట్టుబడుల కట్లపాములన్నీ
మార్క్సు కన్న కమ్యూనిజం
కాంతి వలయాల చుట్టూ
శలభాల్లా గిలగిలా కొట్టుకుంటూ
మలమలా మాడిపోయేవి కదా!
సమాజం పందిరి నిండా
స్నేహ సౌరభాల శాంతి కుసుమాలు
యుద్ధ దుర్గంధాన్ని పారదోలేవి కదా!

కళ్ళముందర స్వార్థ భూతం
తడికుడ్డతో గొంతులు కోస్తున్నా
కుట్రపూరిత వర్గతత్వం
కోటి పడగలెత్తి బుసలు కొడుతున్నా
ఎంతకింత నిర్లక్ష్యం? ఎంతకింత నిర్వేదం?

అందుకే, తడి కళ్ళలోంచి ఎర్రజీరల్లాంటి
అక్షరాల్ని వెతుకుతున్నాను
కలం ఉలితో కొత్తగా మనిషిని చెక్కాలి!
ఈ దేశం నడిబొడ్డుమీద
రక్త మాంసాలతో నడయాడే
మనిషికి ఊపిరి పోసి
తేనె చినుకుల వాన కల్లాపి చల్లాలి!

– పతివాడ నాస్తిక్
94417 24167



అమ్మ సాక్షిగా అడుగుతున్నా...

చనిపోయిన అమ్మ కడుపున
శిశువుగా జన్మించాను
అనాథగా జీతాన్ని ప్రారంభించి
జీవన పోరాటాన్ని మొదలుపెట్టి
విమానాల మోతల మధ్య
బాంబుల శబ్దాల మధ్య
నా జీవిత భవిష్యత్ చిత్రాన్ని
కళ్ళు తెరుస్తూనే చూశాను
మాకంటూ సొంత నేల లేని
మా దేశమనే కాందిశీకుల
రాజ్యంలో ప్రపంచం సాక్షిగా
నేనీలోకంలోకి వచ్చాను
పాలిచ్చి ఎలా పెంచాలని
లాలింపులు ఎలా చేయాలని
మనసులో ఏమేమి అనుకుందో
ఎన్ని ఊసులు తనకి తాను
చేసుకుందో చెప్పుకుందో
మురిసిపోయిందో మా అమ్మ
నాకు అవేవీ తెలియదు
ఈ మానవలోకంలో
ఒక అమానవీయ చర్యతో
నా తల్లి నాకు దూరం కాగా
తన కొడుగ్గా పుట్టిన నేను
నా ముందున్న బతుకు
ఎలా ఉండనుందో ఊహించలేని
రెండు రోజుల బాలుణ్ణి
మా బతుకులు మా సొంతం కాదు
అవి మూణ్ణాల ముచ్చటలే
అమ్మ సాక్షిగా
అడుగుతున్నా ఈ ప్రపంచాన్ని
మాకు తోడుంటారా అని ...

(గాజాపై ఇజ్రాయెల్ బాంబుదాడిలో చనిపోయినా బిడ్డకు జన్మనిచ్చిన అమ్మ అల్-కుర్దీకు నివాళి)

– జంధ్యాల రఘుబాబు
98497 53298



మార్క్సిస్టు దృక్పథం వల్ల ఆలోచనల్లోనూ, అనుభూతుల్లోనూ స్వేచ్ఛా ప్రవృత్తి బాగా విస్తరిస్తుంది. ఇది రచయితల అవగాహనకు, అధ్యయనానికి, సృజనకు బాగా ఉపయోగపడుతుంది.

- రిచర్ట్ రైట్
ప్రఖ్యాత నల్లజాతి రచయిత

ప్రతిచోటా ప్రతిధ్వనించే పాట

సందర్భం



ఇది మహాకవి దాశరథి కష్ణమాచార్య శతజయంతి సంవత్సరం మొదలవుతున్న సందర్భం. ఆయన జీవితంలాగే లిటరరీ స్పెక్ట్రమ్ చాలా విస్తతమైంది, లోతైంది. 1925 జులై 22న జన్మించిన దాశరథి నైజాం వ్యతిరేక పోరాటం చేశారు. డెక్కన్ రేడియోలో, అలాగే ఆకాశవాణిలో కొనసాగారు. అంతకుమించి సినిమాల్లో కూడా రాణించారు. ఆకాశవాణి ఉద్యోగానికి రాజీనామా చేసిన దాశరథి కృష్ణమాచార్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్థాన కవి పదవి కూడా అలంకరించారు. దాశరథి రంగాచార్య మనం చర్చించుకుంటున్న కష్ణమాచార్యకు తమ్ముడు. తెలుగు, సంస్కృతం, ఉర్దూ, ఇంగ్లీషు భాషల్లో ప్రావీణ్యం గడించినట్టే– ప్రసంగం, సాహిత్యం మాత్రమే కాక రేడియో, సినిమా మాధ్యమాల్లో అపూర్వమైన నైపుణ్యం సాధించారు. కవిత్వం మాత్రమే కాక గీతరచనలో కూడా కొత్త ఎత్తులకు పోయారు. ఆకాశవాణి లలిత గీతం, సినిమా గీతం సంబంధించి ఆయన చేసిన కృషి సైతం విలక్షణంగా కనబడుతుంది. అలాగే కవిత్వంలో, పాటలలో భావ చిత్రాలే కాక సామాజిక, చారిత్రక, సైన్స్ పరమైన విషయాలు ఎన్నో కనబడతాయి. శ్రీశ్రీ, ఆరుద్ర, దాశరథి వంటి వారే విజ్ఞాన సంబంధమైన విషయాలను ఆ తరం తెలుగు కవిత్వంలో అడపా దడపా చవిచూపించారు. ఈ సందర్భంలో తెలుగువారి హృదయాల్లో చొచ్చుకుని పోయి, ఇప్పటికి హాయిగా నెలకొని తరచూ నినదిస్తున్న ఒక అభ్యుదయ గీతం గురించి చర్చించుకుందాం.

కొన్ని సంవత్సరాలుగా ఒక విషయం నన్ను వెంటాడుతోంది. “ఆ చల్లని సముద్ర గర్భం...” పాటలో సైన్స్, చరిత్ర, సామాజిక కోణాల్లో కవి భావనలు మనకు ప్రత్యేకంగా దర్శనమిస్తాయి. ఒక పాతిక, ముప్పైయేళ్ళుగా ఈ గీతం తెలుగు నేల అన్ని చోట్ల వినబడుతూ వస్తోంది. అయితే, ఈ పాటలో కొన్ని పదాలు, పాదాలు ఒక్కోచోట, ఒక్కో సందర్భంలో వేరుగా వేరుగా వినబడుతున్నాయి. దీంతో మరింత ఆసక్తి కలిగి కొంత పరిశీలన చేశాను. ఇప్పుడు నా వద్ద మూల గీతంతో పాటు నాలుగు వెర్షన్లు ఉన్నాయి.

ఇరవయ్యేళ్ళ లోపునే దాశరథి నైజాం పాలనకు వ్యతిరేకంగా కవిత్వం రాయడం, పోలీసుల దృష్టిలో పడటం గమనార్హం. దాశరథి కష్ణమాచార్య తొలి కవితా గ్రంథం 1949లో వెలువడిన ‘అగ్నిధార’. ఈ సంకలనంలోని కవితలు చాలావరకు తొలుత ప్రచారంలోకి వచ్చి జనుల నోట నానిన తర్వాత ప్రచురింపబడ్డాయి. ‘నా కోటి రతనాల వీణ...’ గీతం ఈ సంకలనం లోనిదే! అంతే కాదు ‘ఈ చల్లని సముద్ర గర్భం...’ గీతం కూడా ‘అగ్నిధార’ లోనిదే.

1988 తర్వాత అక్షరాస్యత, మూఢనమ్మకాల నిర్మూలన, సైన్స్ దృష్టి వంటి విషయాలు కొన్ని సంస్థల ఎజెండాగా మారడంతో ఉదాత్తమైన పాటలు ప్రాచుర్యం పొంది, మళ్ళీ వినిపించడం మొదలైంది. దానికి కొత్తగా వచ్చిన టెక్నాలజి దీనికి ఎంతో దోహదపడింది. ఈ కారణాలతో 1991లో గోవా నుంచి వచ్చిన తర్వాత చాలా చోట్ల, చాలా సందర్భాల్లో ఈ పాట విన్నాను. ‘అగ్నిధార’లో లభ్యమయ్యే గీతం పల్లవితో పాటు ఆరు చరణాలుగా సాగుతుంది. పల్లవీ, చరణం ప్రతిదీ నాలుగు పాదాలుగా, ప్రతి పాదం 14 మాత్రలుగా సాగుతుంది. పాటకు అవసరమైన దార్శనికత, భావం, లయ, భావుకత పుష్కలంగా ఉన్నాయి. ప్రకృతిని అవలోకింప చేసే పల్లవితో పాటు ఒక చరణం సైన్స్, మరో చరణం చరిత్ర... మిగతా నాలుగూ సామాజిక దర్శనంతో తొణికిస లాడుతాయి.

ఆ చల్లని సముద్రగర్భం
దాచిన బడబానలమెంతో?
ఆ నల్లని ఆకాశంలో
కానరాని భానువులెందరో?

భూగోళం పుట్టుక కోసం
కూలిన సురగోళాలెన్నో?
ఈ మానవరూపం కోసం
జరిగిన పరిణామాలెన్నో

ఒక రాజును గెలిపించుటలో
ఒరిగిన నరకంఠాలెన్నో?
శ్రమజీవుల పచ్చి నెత్తురులు
త్రాగని ధనవంతులెందరో?

అన్నార్తులు అనాథలుండని
ఆ నవయుగ మదెంత దూరమో?
కరువంటూ కాటకమంటూ
కనుపించని కాలాలెపుడో?

అణగారిన అగ్ని పర్వతం
కని పెంచిన ‘లావా’ యెంతో?
ఆకలితో చచ్చే పేదల
శోకంలో కోపం యెంతో?

పసిపాపల నిదుర కనులలో
ముసిరిన భవితవ్యం యెంతో?
గాయపడిన కవిగుండెల్లో
వ్రాయబడని కావ్యాలెన్నో?

కుల మతముల సుడిగుండాలకు
బలిగాని పవిత్రులెందరో?
భరతావని బలపరాక్రమం
చెర వీడే దింకెన్నాళ్ళకో? **(అగ్నిధార, 1949)**

వేదికల మీద, యూట్యూబ్‌లో, రేడియోలో మాత్రమే కాక తెలంగాణ, ఆంధ్ర పల్లె ప్రాంతాల్లో నేడు విరివిగా వినబడే పాట ఇది. ఆకాశవాణిలో జాతీయస్థాయిలో ‘సాంగ్ ఆఫ్ ది మంత్’ అనే ప్రయోగం చాలా కాలం నడిచింది. ఆయా భాషలలో మంచి ఉదాత్తమైన పాటలనుంచి ఎంపిక చేసి పూర్తి సంగీతపు హంగులతో దీనిని రికార్డు చేసి నెలలో నాలుగు సార్లు వినిపించడం ఆకాశవాణి ప్రణాళిక. దీనితో మంచి ప్రాచుర్యం కూడా సిద్ధిస్తుంది. అలా 1992లో డా. మహాభాష్యం చిత్తరంజన్ సంగీత రూపకల్పనలో ఆకాశవాణి హైదరాబాదు రికార్డింగ్ ‘ఈ మాసపు పాట’ రికార్డయ్యింది. దాన్ని ప్రసిద్ధ గాయకులు కె.బి.కె.మోహన్ రాజు (కొండా బాబు కృష్ణమోహన రాజు), విజయలక్ష్మి శర్మ పాడారు. కొన్నేళ్ళ క్రితం కె.బి.కె. మోహనరాజు ఫేస్‌బుక్‌లో షేర్ చేసినపుడు నేను జాగ్రత్తగా విన్నాను. ఇందులో ప్రత్యేకత ఏమంటే– ఆరు చరణాలు కాకుండా 1, 3, 5 చరణాలు మాత్రమే ఉన్నాయి.

అయితే ఎక్కువమంది గాయనీ గాయకులు అంటే వందేమాతరం శ్రీనివాస్, విమలక్క, వరంగల్ శంకర్, ప్రజానాట్య మండలి, జనవిజ్ఞాన వేదిక ఇంకా పలు సంస్థలు ద్వారా పాడిన, లేదా పాడే గీతంలో మూలంలో మూడింట రెండు వంతులు మనకు వినబడుతోంది. ఖమ్మం నివాసి బూరగడ్డ కందాడై విజయకుమారాచార్య ఈ గీతానికి ట్యూన్ కట్టారు. అదే ప్రాచుర్యంలోకి వచ్చింది. కానీ రెండు చరణాలు కలిపి ఒక చరణంగా పాడటం ఇక్కడ గమనించవచ్చు. మొత్తం ఒకటో చరణం 2, 6 చరణాలలో కొంత భాగం కలసి ఒక చరణంగానూ; మూడు, ఐదు చరణాలు ఒక చరణంగా ఇక్కడ మనకు వినబడతాయి. ఈ మొత్తం పాటలో నాల్గవ చరణం అసలు కనబడదు. ఎం శశిధర శర్మ పాడిన వెర్షన్లో దాశరథి మొత్తం పాట మనకు లభిస్తుంది. ఈ వెర్షన్స్ అన్నింటిలో ప్రధానమైన తేడా పల్లవిలో ‘కానరాని భానువులెందరో’ ‘ కానరాని భాస్కరులెందరో’ అనే తేడాను గమనించవచ్చు.

ఇవన్నీ కాకుండా జనవిజ్ఞాన వేదిక తెలంగాణ కొన్ని సంవత్సరాల క్రితం ఈ గీతాన్ని ఒక క్యాలండర్‌గా చాలా ఆకర్షణీయంగా ముద్రించింది. ఇందులో మూలంలో లేని (రెండు చరణాలు నిడివిలో) ఒక చరణంగా మనం గమనించవచ్చు. ఆ పాదాలు ఇలా ఉన్నాయి:

మానవ కళ్యాణం కోసం
పణమొడ్డిన రక్తం యెంతో
రణరక్కసి కరాళనత్యం
రాల్చిన పసిప్రాణాలెన్నో

కడుపుకోతతో అల్లాడిన
కన్నులలో విషాదమెంతో
ధనవంతుల దుర్మార్గాలకు
దగ్ధమైన బ్రతుకులుయెన్నో... ..ఆ చల్లని ..

ఇలా మార్పులు ఎందుకు వస్తాయి? ఆ మార్పులకు కవి ఆమోదం ఉందా? అది ఒక పాట బహుళ ప్రచారమైనపుడు సంభవించే విషయంగా పరిగణించాల్సి ఉంటుందా? అనే విషయాలు ఇప్పుడు తేల్చలేము. కేవలం వినడం ఆధారంగానే గుర్తు పెట్టుకుంటాం, ప్రతిసారి మూలాన్ని సంప్రదించే సౌకర్యం ఉండకపోవచ్చు. అందువల్ల మరింత శ్రావ్యంగా ఉండే పదాలు రావచ్చు లేదా మరింత ఆమోదకరమైన భావంతో కొన్ని పదాలు మార్చబడవచ్చు. ‘వ్రాయబడని కావ్యాలెన్నో’ అనే దానికన్నా ‘రాయబడని కావ్యాలెన్నో’ అనడం హాయిగా ఉంటుంది. ఇపుడు యూట్యూబ్‌లలో చాలామంది పాడిన ఈ పాట చాలా రకాలుగా లభించడం దాశరథి గీతానికున్న ప్రాచుర్యానికి కొలమానం, సాహిత్యానికి బహుమానం!

అదే సమయంలో సీరియస్ విషయాలు, నాన్ ఫిక్షన్ సంబంధించిన అంశాలు అంటూ కాస్త నిరాదరణకు లోనయ్యే సైన్సు, చరిత్ర, సామాజికం వంటి వాటి లోపలి పార్శ్వాల మర్మాలను రమణీయమైన గీతంగా సృజించిన దాశరథి కృష్ణమాచార్య ప్రతిభకు, నైపుణ్యానికి, దర్శనీయతకు జోహార్లు!

(నేడు మహాకవి దాశరథి శత జయంతి సంవత్సర ప్రారంభం)

– డా. నాగసూరి వేణుగోపాల్,
ఆకాశవాణి పూర్వ సంచాలకులు, 94407 32392



ప్రగతివాది .. ప్రజా పక్షపాతి ...

నివాళి

అభ్యుదయ కవి ఆడిగోపుల వెంకటరత్నం తన 30వ ఏట అంటే 1975లో కవిత్వ రచన ప్రారంభించి, అవిశ్రాంతంగా ఐదు దశాబ్దాల పాటు కొనసాగించారు. తన 80వ ఏట 28వ కవితా సంపుటం ‘నిలువెత్తు సంతకం’ వెలువరించి, ఈ నెల 19వ తేదీన దేహయాత్ర చాలించారు. మంచి మనిషిగా ఉండి బోలెడంత కవిత్వం రాయవచ్చుననే జర్మనీ తత్వజ్ఞుడు గోథే మాటలకు ప్రతిబింబంగా అడిగోపుల నిలిచారు. ఇటీవల ఆయన ‘నిలువెత్తు సంతకం’ కవితా సంపుటికి విశాలాక్షి వారి జాతీయ పురస్కారం లభించిన సందర్భంగా – సాహిత్య విమర్శకులు కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ, ‘అడిగోపులది అభ్యుదయ కవిత్వం’ అని వారి కవిత్వాన్ని విశ్లేషించారు. “అడిగోపుల వ్యక్తిగా బహు సౌమ్యుడు. కవిగా మాత్రం చాలా శక్తివంతుడు’ అని రాచపాళెం చంద్రశేఖర రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన అడిగోపుల వత్తిరీత్యా సివిల్ ఇంజనీర్. తన కవిత్వంలో అదే ఇంజనీరింగ్ నిర్మాణ సౌష్టవం వైవిధ్యం, వినూత్న రూపకల్పనలుగా పనిత ̃నంతో పటిష్ట కట్టడాలుగా కవితా సౌధాలు నిర్మించారు. ఆయన కవితా సంపుటాల క్రమాన్ని, ముందుమాటల్లో సాహితీ విమర్శకులు చేసిన పరిశీలనలను బట్టి అడిగోపుల సాహిత్య వ్యక్తిత్వాన్ని, కవితా వికాసాన్ని అంచనా వేయొచ్చు.

70వ దశకంలో కవిత్వం రాయడం ఆరంభించి ‘సూర్యోదయం’ పేరుతో 1984లో తన మొదటి కవితా సంపుటిని వెలువరించారు అడిగోపుల. దీనికి ‘అభినందనలు’ పేరిట ఆరుద్ర ముందుమాట రాశారు. కవితల్లో కొత్త గొంతుక వినబడుతోందని, కొత్త చూపు కనపడుతుందని, కొత్త మలుపు తారసపడుతుందని కితాబు ఇచ్చారు. 1985లో ‘ఎన్నాళ్ళీ చరిత్ర’ పుస్తకానికి మనసు కవి ఆచార్య ఆత్రేయ ఆప్త వాక్యాలు రాశారు. “నీ ముందు ఓటు కోసం నేడు అడుక్కుంటున్న అతని ముందు/ నువ్వు అప్రమత్తంగా ఉండకపోతే, రేపు అతని ముందు నువ్వు అడుక్కోవాల్సి వస్తుందని’ హెచ్చరించిన కవిని అభినందించారు. ‘ఎర్రజెండా అర మీటరు గుడ్డ కాదు/ అనేకమంది రక్తం’ అన్నారు అడిగోపుల ఆ సంపుటిలోని ‘ఎర్రజెండా’ కవితలో. 1986లో ‘జీవన పోరాటం’ కవితా సంపుటికి ముందుమాట రాస్తూ డాక్టర్ మరుపూరు కోదండరామరెడ్డి ... “సాహిత్యమే వృత్తిగా కలిగిన వ్యక్తి కవిత్వం రాస్తే అందులో విశేషం లేదు. ఒక యువ ఇంజనీరు మధురమైన భావస్ఫూర్తితో అధిక్షేపణ రూపమైన మార్గదర్శకమైన కవిత్వం చెప్పి ఇంపు కలిగిస్తున్నాడు.” అన్నారు. ఇందులో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య గారి అంత్యక్రియలను చూసి స్పందించి రాసిన కవిత ఉంది. “మండువేసవిలో/ అశేష జన అశ్రుతర్పణతో/ ఎండిన కృష్ణమ్మ నిండుగా పారింది/ నల్లని నీరంతా ఎర్రగా మారింది” అన్నారు అడిగోపుల. నాల్గవ కవితా సంపుటి ‘బానిసత్వం అమ్మబడును’ (1987). దీనికి రాచకొండ విశ్వనాథ శాస్త్రి ముందుమాట రాశారు. తనకు కవిత్వంలో అనుభవం లేదంటూనే కవిత్వం ఎలా ఉండాలో అడిగోపులను ఎత్తిచూపుతూ కవితారీతుల్ని ఉదహరించారు. ఐదవ సంపుటి (1988) ‘మరణానికి రెండు ముఖాలు’కు గుంటూరు శేషేంద్ర శర్మ ముందు మాట రాస్తూ... “వీరి కావ్యం మనకు జ్ఞాపకం చేయని బాధ అంటూ లేదు. ఈ కావ్యాన్ని ‘భారతీయ బాధల నిఘంటువు’ అనవచ్చు” అన్నారు. దీనికి రెండో మాటను రాసిన డాక్టర్ సంజీవదేవ్ – “ఇందులోని కవితలు చదువుతున్నంతసేపు ఆలోచననిస్తాయి. అనుభూతినిస్తాయి” అని పేర్కొన్నారు. 1990లో వచ్చిన “విప్లవానికి పురిటి గది” కవితా సంపుటికి డాక్టర్ తంగిరాల వెంకట సుబ్బారావు ముందుమాట రాస్తూ “అసలు సిసలైన కవి న్యూస్‌పేపర్ రిపోర్ట్ లాంటి ప్రకటనలు చేయడు. అలంకారమో చమత్కారమో రసభావమో ధ్వనో ప్రతికో.. చేర్చి, అందులోని భావాల్ని మండిస్తాడు, జనాన్ని ఆనందింప చేస్తాడు, ఆలోచింప చేస్తాడు” అంటారు. “అశ్రువీధిలో అగ్నిగానం” (1991) అడిగోపుల ఏడవ కవితా సంపుటి. దీనికి ఎస్వి భుజంగరాయ శర్మ ముందు మాట రాస్తూ.. “సామాజిక స్వరూపాన్ని ఈ రచయిత అవగాహన చేసుకున్నాడు అనటానికి ఈ కావ్యంలో ఇంతకుముందు రాసిన కావ్యాల్లోనూ దాఖలాలు ఉన్నాయ్” అన్నారు. 1992లో తెచ్చిన 8వ కవితా సంపుటి “యుద్ధం అంటే మాకు భయం లేదు”కు వీరాజీ ముందుమాట రాశారు. సూర్యుడిని తలగడ కింద దాచుకొని అంతా చీకటి అంటూ వాపోయే చిత్రమైన మనిషిని తట్టి లేపాలనే పంతం గల కవి అడిగోపుల అంటారు. “మట్టి మౌనం వహించదు” (1994) కవితా సంపుకి రావూరి భరద్వాజ ముందుమాట రాస్తూ కొత్తగా వెచ్చగా కారంగా పరిమళంగా మట్టి వాసనగా సూచనగా సమగ్రంగా.. ఇంకా చాలా చాలా వాటిగా ఇందులోని కవితలు ఉన్నాయంటూ అభినందించారు. “మహా పత్రం” (1996) కవితా సంపుటికి ముందుమాట రాసిన డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు– “శిల్ప సుందరం కాని, జీవిత సంపర్కం లేని కవిత్వం ఎంత గొప్పదైనా నిరుపయోగం అనే సంగతి ఆరుద్రకి అతడి ఏకలవ్య శిష్యుడు అడిగోపులకి తెలుసున”ని అన్నారు.

“రాతి చిగుళ్ళు” (1988) కవితా సంపుటికి ఎవరి ముందుమాట లేకుండానే ప్రచురించారు. హృదిలో సుధలు చిందించేందుకు మనిషిని సంస్కరించాలనేది రాత్రి చిగుళ్ళ కవితల్లోని రహస్యం. తరవాత వచ్చిన ‘అదృశ్య కుడ్యం’ (2000) సంపుటికి రావెల సాంబశివరావు ముందుమాట రాస్తూ.. “వీరి పలికే పదం, రాసే వాక్యం, వినిపించే సందేశం వృథా పోవు” అంటారు. 2002లో వచ్చిన ‘సంకెళ్లు తెగిన చప్పుళ్ళు’ సంపుటికి రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి ముందుమాట రాస్తూ, “అడిగోపుల వస్తువుకు అధిక ప్రాధాన్యమిచ్చి భావుకత విషయంలో చాలా నిగ్రహం పాటిస్తారు. అందమైన తెలుగు మాటలతో మంచి కవిత్వం చదువుతున్నామన్న అనుభూతిని కలిగిస్తారు” అని పేర్కొన్నారు. “శ్వేత పత్రం” (2004) సంపుటిని సమాజానికి శ్వేతపత్రంగా భావిస్తూ కెఆర్‌కె మోహన్ ముందుమాట రాశారు. 2006లో ‘విశ్వగీతం’ కవితా సంపుటికి కాటూరి రవీంద్ర త్రివిక్రమ్ – విశ్వ విపంచినాదం అంటూ ముందుమాట రాశారు. ఈ కవి ఆవిష్కరించిన భావ శిల్పాలు వెలకట్టలేనివి, సాహిత్య శిశువులకవి రసరమ్య గీతాలని అన్నారు.

2009లో ప్రచురించిన ‘రంగుల చీకటి’ (2009) సంపుటిలో – ప్రపంచీకరణ సరళీకరణ అనేవి నీతిని ఏ విధంగా నిమజ్జనం చేస్తాయో ఆవిష్కరించారు అడిగోపుల. 2011లో వచ్చిన ‘రేపటి వర్తమానం’ కవితా సంపుటికి డాక్టర్ జె బాపురెడ్డి ముందుమాట రాశారు. “అడిగోపుల తన గ్రంథాలకు పెట్టుకున్న పేర్లు సార్థక నామధేయాలు. వాటికి తగినట్లే అవి సాధించాయి ఆయన ఆశించిన ధ్యేయాలు” అన్నారు. 2013లో “రెక్క విప్పిన రాగం” కవితా సంపుటికి విహారి ముందుమాట రాశారు. “విశేష రచనానుభవం, ఏడు దశాబ్దాల జీవితానుభవం, విస్తృతమైన అధ్యయనానుభవం... వీటి త్రివేణి– అడిగోపుల వెంకటరత్నం ఆత్మగానం” అని పేర్కొన్నారు. 2016లో వచ్చిన “రేపటి జ్ఞాపకం” కవితా సంపుటికి నండూరి రాజగోపాల్ ముందుమాట రాస్తూ... “ఇందులోని కవిత్వం ఒక సన్నిహితుడికి వినిపిస్తున్న స్వగతంలా ఉంటుంది.” అంటారు. 2017లో వచ్చిన “ముందడుగు” కవితా సంపుటికి మేడిపల్లి రవికుమార్ ముందుమాట రాశారు. నిబద్ధతకు, సమాజం పట్ల బాధ్యతకు, మానవ సంబంధాల పట్ల ఉన్న లోచూపునకు, భవిష్యత్తు నిర్మాణం పట్ల కవికున్న ఆంక్షలకు నిదర్శనంగా ఇందులోని కవితలు ఉన్నాయని అన్నారు. “పదండి ముందుకు” పేరుతో 2019లో వెలువరించిన కవితా సంపుటికి రావెల సాంబశివరావు ముందుమాట రాశారు. “స్వేచ్ఛను బలిగొన్న మనిషి ఎంత నిర్దయుడో, తాను నిశ్శబ్దమై ప్రపంచాన్ని శబ్దమయం గావించిన మనిషెంత విధ్వంసకుడో కొంతైనా తెలియాలంటే అడిగోపుల కవిత్వంతో కరచాలనం చేయాల్సిందే”నని అన్నారు. ఆ తరువాత, 2020లో “కాలం నా చేతిలో ఉంది”, “జయభేరి”, “కొత్తగాలి”, “నిలువెత్తు సంతకం” కవితా సంపుటాలను అడిగోపుల వెలువరించారు. 80 దశకంలో కథలు కూడా రాసినప్పటికీ ఆ తరువాత కవితాసృజనకే పరిమితం అయ్యారు. జీవితాంతం ప్రజాగొంతుకను వినిపిస్తూనే కవిత్వం రాశారు అడిగోపుల. ఒక ప్రత్యేకమైన శైలితో, జనపక్ష వైఖరితో ఆయన సృజియించిన కవిత్వం తెలుగు సాహిత్య చరిత్రలో రెపరెపలాడుతూనే ఉంటుంది.

– మల్లేశ్వరరావు ఆకుల
79818 72655

‘మట్టి తంబూర’ ఒక మహా కాంతి సంగీతం

పేరులోనే కాదు, ఆయన మనసు తీరులో కూడా మల్లెపూల మెత్తదనం ఉంది. మెత్తగా ఆ గుబాళింపు మన ఆత్మలను స్మృశిస్తుంది. నేను ధ్యానముద్రలో ఉన్న గౌతమ ముని ముందు కూర్చుని తదేకంగా ఆయననే చూస్తున్నట్టు మల్లెల నరసింహమూర్తి ‘మట్టి తంబూర’ కవిత్వం ముందు కూర్చున్నాను. మల్లెలలో రుషిత్వం ఉందని శేషేంద్ర ఎందు కన్నాడో ఈ కొత్త పుస్తకం మనసును తట్టి మరీ బోధించింది! భాషతో విన్యాసాలు చేయడమే కవిత్వం అనుకునే కాలానికి ఎప్పుడో కాలం చెల్లిపోయింది. మారుతున్న కాలానికి, మారుతున్న రాజకీయ, సాంస్కృతిక, చారిత్రక ప్రాపంచిక దృక్పథాలకు, నేపథ్యాలకు అనుగుణంగా కవిత్వంలో మార్పు రాదా? అంటే ఆ మార్పు రూపంలో కాదు, సారంలో ఉంటుంది అని చెప్తాను. దానికి పరమోదాహరణగా ఈ ‘మట్టి తంబూర’ను చూపిస్తాను.

గతంలో ‘జలస్వప్నం’ రాసిన మల్లెల నరసింహమూర్తి మరో కావ్యం ఏదీ రాయకపోయినా కవిత్వం ఉన్నంతకాలం కవిగా బతికే ఉంటాడు. తరతరాలుగా వాన శేష ప్రశ్నగా మిగిలిన సీమ బతుకుల ఆత్మఘోషను ఆ కావ్యంలో ఆవిష్కరించారు మల్లెల. నదులు, అలలు, ఆఖరికి చిన్న వాన చినుకు కూడా కలలు కలలుగా సీమగుండెకు చిల్లులు పెట్టిన ఒక విషాద ధ్వంస చరిత్రకు అద్దం పట్టింది జలస్వప్నం. అయితే మల్లెలలో భావగాఢత తాత్త్విక గాఢతగా పరిణమించిన పరిమళ స్వరూపం ‘మట్టి తంబూర’లో మనం దర్శించుకోవచ్చు.

ఆధునిక కవిత్వ నిర్మాణం శబ్దంలో లేదు. కవి ఆత్మలో ఉంది. పదాల విరుపుల గారడీల గమ్మత్తుల్లో లేదు. ఆధునిక కవిత పైపైన పల్చబడుతూ లోపల అంతా చిక్కబడిపోతుంది. పదాల పటాటోపం లేని గాఢత, గూఢత కవి తాత్వికతలో అంతర్భాగంగా అల్లుకుపోతుంది. సాధారణ వాక్యం నిర్మలంగా లోపలికి లాక్కొని అంతుచిక్కని లోకాల్లోకి తీసుకుపోతుంది. అక్కడ ఉంటుంది– ఆధునిక కవిత అసలు రూపం. అదే నిర్మాణం. ఈ వెలుగులో మల్లెల ఏం సాధించారో చూడడానికి నేను ప్రయత్నించాను. ఒక నది కోసం జీవితమంతా కలలు కన్న కవి తనలోనే నదిని చూసుకున్నాడు. “నీ నడకే ఒక నది/ నువ్వు నడవడం అంటే నది ప్రవహించడమే” అని తన జీవిత కాలపు జలస్వప్నాన్ని తనలో సాకారం చేసుకున్నాడు. ఇంకా ఎక్కడికి వెళ్లాడు? “దుఃఖమే కదా మనిషిని విశ్వాస సాయుధునిగా మలిచే మంత్రశక్తి” అనేదాకా వెళ్ళాడు. తన దేహాత్మలతో నీటిని తట్టి చూసిన ఈ కవి ఇప్పుడు ‘మట్టిని తట్టి చూడు’ అంటున్నాడు. “అంతా దర్శనంలోనే/ అంతర్దర్శనంలోనే/ అంతర్వస్తు దర్శనంలోనే ఇమిడి ఉంది” అని ఒక పరిపక్వ సూత్రీకరణ అందిస్తున్నాడు.

ఇక ఈ కవికి దారి తెలిసిపోయింది కాబట్టే – ‘అన్వేషయాత్ర’ అని ఓ కవిత రాయగలిగాడు. ‘ప్రేమించడానికి కొంచెం ప్రేమ కావాలి/ జీవించడానికి కాస్తంత ధ్యానపు వెన్నెల కావాలి’ ఇది ఈ కవి జీవనాన్వేషణ తత్వసారం. కవి దర్శించిన జీవన తాత్త్విక గాఢతలోకి తీసుకుపోతుందీ కవిత. ఎవరో వరం కోరుకోమన్నట్టు కవి ఇక్కడ ఒక జాబితా మన ముందు పెడతాడు. ఇవన్నీ సిద్ధించిన కవి సిద్ధార్థుడే అవుతాడు. అప్పుడు మనం ‘కలమాగిన పూర్ణఫలం లాంటి, పున్నమి జాబిలిలోంచి ఒలికే వెన్నెల రసం’ లాంటి కవిత్వాన్ని గ్రోలుతాం. అప్పుడు ఈ కవి చెప్పినట్టు బతుకొక బుద్ధుని గాంధార శిల్పముద్రగా మారిపోతుంది.

“దేహం నాది / శ్వాస నీది
నీవు రహస్యపు వెన్నెల నది ఒడ్డున ఏకాంత తరుచ్ఛాయ
నేను మసకేసిన మబ్బులపరదా చాటున జాబిల్లిజాతర మాయ
దేన్ని ఒడికట్టుకోవాలో/ దేన్ని విడగొట్టుకోవాలో
తెలియని సందిగ్ధ సంధ్యలో మనం
మన చుట్టూ ముసిరిన ప్రాచీన మౌనం”

మనల్ని ఎటు నుంచి ఎటు తీసుకు వెళుతున్నాడీ కవి? ఒక విశుద్ధ మార్మికపు మబ్బులతో కమ్మిన ఆకాశంలో మనకు ఏం చూపించాలనుకుంటున్నాడీ కవి? లోకంలో ఎన్నెన్నో చూసినట్టే తన కవితల్లో ఎన్నెన్నో వస్తువుల్ని ఎంచుకుంటాడు. అంతిమంగా మొత్తం విశ్వసారం ఏమిటో తెలుసుకుంటాడు. అదే మనతో పంచుకుంటాడు. చూడండి.. ‘రూప భేదం’ కవితలో చివరిగా అంటాడు : “అయినా సారంలో నేను ఒక విశ్వరూపాన్ని/ కవిని కన్న భూమిని/ సారాంశంలో మృణ్మయ రూపాన్ని” చూశారా? తాను కేవలం ఒక అక్షరం కాదు, ఒక మహా కావ్యాన్నని, తాను ఒక బిందువు కాదు ఒక సముద్రమని, తాను ఒక పక్షి కాదు ఒక ఆకాశమని చెబుతూ చివరికి ఇలా ఒక మణ్మయ రూపాన్ని ఆవిష్కరిస్తాడు. అదే ‘మట్టి తంబూర’. మల్లెల మీటిన ఈ మట్టి తంబూర మన కవిత్వంలో కొత్త వెలుగులు తట్టి లేపుతుంది. అనేక కవితల్లో వస్తువు ఏదైనా, అక్కడక్కడ కొన్ని కొన్ని వాక్యాల రూపంలోనైనా ఈ కవిలోని పరిణామతత్వం మనకు బోధపడుతుంది. ‘మంచి మనసున్న ఊరు మైసూరు/ ఎప్పుడూ మౌనాన్ని నెమరు వేసే గోవు’ ఈ వాక్యం ఎలా వచ్చింది? ఇలాంటి వాక్యాలతో అత్యంత సహజాతి సహజమైన పదాల పోహళింపుతో బౌద్ధ తాత్వికత వైపు, జెన్ కవుల మార్మికత వైపు అడుగులు వేయడానికి ఈ కవిత్వం సాయపడుతుంది. ఇంత పరిణతి చెందిన, తాత్విక గాఢతతో కూడిన కవిత్వాన్ని అందించిన ప్రియమిత్రుడు మల్లెల నరసింహమూర్తికి నా హృదయపూర్వక అభినందనలు.



(‘మట్టి తంబూర’ కవితా సంపుటికి రాసిన ముందుమాటలో కొంత భాగం ఇది. ఈనెల 22న హైదరాబాదులో పుస్తకావిష్కరణ జరుగుతుంది.)

– ప్రసాదమూర్తి

తుమ్మితే ఊడే ఉద్యోగం



- తయారీ రంగంలో పెరుగుతున్న కాంట్రాక్ట్ కార్మికులు
- సహస్రాబ్ది ప్రారంభం నుంచి ఇదే ధోరణి
- పట్టణాల కంటే గ్రామాల్లోనే అధికం
- వర్తించని ఉద్యోగ ప్రయోజనాలు

న్యూఢిల్లీ : దేశంలో 2021-22 నాటికి అధికారిక తయారీ రంగంలో 1.3 కోట్ల మంది కార్మికులు పనిచేస్తున్నారని పరిశ్రమల వార్షిక సర్వే (ఎఎస్ఐ) తెలిపింది. వీరిలో 81 లక్షల మంది నేరుగా నియమితులైన శాశ్వత ఉద్యోగులు కాగా యాభై ఐదు లక్షల మంది కాంట్రాక్ట్ కార్మికులే. నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్ఎస్ఎస్ఒ) ప్రతి ఏటా పరిశ్రమల వార్షిక సర్వేను నిర్వహిస్తుంది. పారిశ్రామిక గణాంకాలకు ఇదే ఆధారం. దేశంలో తయారీ రంగం సాధించిన ఫలితాలను ఈ సర్వే సవివరంగా అందిస్తుంది.

దేశంలోని కర్మాగారాల్లో పనిచేస్తున్న కార్మికుల సంఖ్య పెరుగుతోంది. అయితే వారంతా ఇప్పుడు కాంట్రాక్ట్ కార్మికులేనని 2001-02, 2017-18 మధ్యకాలంలో ఏఎస్ఐ అందించిన సమాచారం చెబుతోంది. 2001-02లో ఉత్పత్తి రంగంలో 5.96 మిలియన్ల కార్మికులు పనిచేశారు. 2017-18 నాటికి వారి సంఖ్య 12.2 మిలియన్లకు చేరింది. అయితే ఇదే కాలంలో ఫ్యాక్టరీల్లో నేరుగా నియామకాలు పొందిన కార్మికుల సంఖ్య 78.2 శాతం నుండి 63.6 శాతానికి పడిపోయింది. మరోవైపు కాంట్రాక్ట్ కార్మికులు 21.8 శాతం నుండి 36.4 శాతానికి పెరిగారని సెంటర్ ఫర్ ఎకనమిక్ డాటా అండ్ అనాలసిస్ (కెడా) తెలిపింది. 2002-03 నుండి 2021-22 వరకూ ఫ్యాక్టరీల్లో కార్మికుల నియామకాలకు సంబంధించిన గణాంకాలను విశ్లేషిస్తే పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి.

తగ్గుతూ... పెరుగుతూ

2002-03లో దేశంలో 1,40,748 ఫ్యాక్టరీ యూనిట్లు పనిచేస్తున్నాయి. 2021-22 నాటికి వీటి సంఖ్య 2,00,576కు... అంటే 43 శాతం పెరిగింది. ఇదే సమయంలో ఆయా ఫ్యాక్టరీల్లో నియమితులైన కార్మికుల సంఖ్య 61 లక్షల నుండి 1.36 కోట్లకు పెరిగింది. అంటే కార్మికుల సంఖ్య రెట్టింపునకు పైగా పెరిగిందన్న మాట. అయితే ఈ పెరుగుదల అసమానతలతో కూడి ఉంది. 2003-04లో అంతకుముందు ఏడాదితో పోలిస్తే కార్మికుల సంఖ్య 6 శాతానికి పైగా తగ్గింది. ఆ తర్వాతి సంవత్సరాల్లో పెరుగుదల కన్పించింది. కానీ 2012-13లో అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే కార్మికుల సంఖ్య 4 శాతం తగ్గిపోయింది. 2020-21లో అంటే కోవిడ్ తొలి దశలో ఉత్పత్తి రంగంలో కార్మికుల సంఖ్య 3.6 శాతం పడిపోయింది. ఆ తర్వాతి సంవత్సరం 8.1 శాతం మేర పెరిగి 1.36 కోట్లకు చేరిందని ఏఎస్ఐ సమాచారం తెలిపింది.

పెరుగుతున్న కాంట్రాక్ట్ కార్మికులు

అయితే ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే సహస్రాబ్ది మొదలైనప్పటి నుండి పరిశ్రమల్లో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య బాగా పెరిగిపోయింది. 2002-03, 2021-22 మధ్యకాలంలో నేరుగా నియమితులైన కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య 47 లక్షల నుండి 81 లక్షలకు పెరగ్గా కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య 14 లక్షల నుండి 55 లక్షలకు పెరిగింది. అంటే నేరుగా నియమితులైన కార్మికుల సంఖ్య 72.3 శాతం పెరిగితే కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య ఏకంగా 292.9 శాతం పెరిగింది. దీనిని బట్టి అర్థమవుతోంది ఏమిటంటే దేశంలోని సంస్థలు తమ కర్మాగారాలను నడపడానికి కాంట్రాక్ట్ కార్మికుల పైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. వీరిని ఆయా సంస్థలు నేరుగా నియమించుకోవు. థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారా కాంట్రాక్ట్ పద్ధతిపై తీసుకుంటాయి. ఇందుకు అనేక కారణాలు ఉంటాయి. శాశ్వత ఉద్యోగులకు లభించే పలు ప్రయోజనాలు.. .అంటే ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా, వేతనంతో కూడిన సెలవలు వంటివి కాంట్రాక్ట్ కార్మికులకు వర్తించవు. ఒక్క మాటలో చెప్పాలంటే వారిది తుమ్మితే ఊడిపోయే ఉద్యోగం.

గ్రామీణ ప్రాంతాల్లోనే అధికం

పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లోని ఫ్యాక్టరీలే కాంట్రాక్ట్ కార్మికులను అధిక సంఖ్యలో తీసుకుంటాయి. 2002-03లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య ఒకేలా ఉంది. కానీ ఆ తర్వాత ఈ రెండు ప్రాంతాల మధ్య అంతరం బాగా పెరిగిపోయింది. 2021-22లో గ్రామీణ ప్రాంతాల్లోని కార్మికుల్లో 43.5 శాతం మంది కాంట్రాక్ట్ కార్మికులే. 2002-03లో ఈ సంఖ్య కేవలం 23.2 శాతం మాత్రమే. అదే పట్టణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 23.1 శాతం నుంచి 37.5 శాతానికి పెరిగింది.

పరిశ్రమల వారీగా...

కాంట్రాక్ట్ కార్మికుల వాటా అన్ని రకాల కర్మాగారాల్లో ఒకేలా లేదు. కోక్, రిఫైన్డ్ పెట్రోలియం, అణు ఇంధన పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య అధికంగా ఉంది. 2021-22లో ఈ పరిశ్రమలో పనిచేసిన ప్రతి నలుగురు కార్మికుల్లో ముగ్గురు (74.6 శాతం) కాంట్రాక్ట్ కార్మికులే. నాన్-మెటాలిక్ ఖనిజ పరిశ్రమ, రవాణా పరికరాల పరిశ్రమ, ఎలక్ట్రికల్-ఆప్టికల్ పరికరాల పరిశ్రమలో కూడా కాంట్రాక్ట్ కార్మికులు ఎక్కువగానే ఉన్నారు. దీనికి భిన్నంగా వస్త్రాలు, జౌళి ఉత్పత్తులు, తోలు-పాదరక్షల పరిశ్రమలో నేరుగా నియమితులైన శాశ్వత ఉద్యోగుల సంఖ్యే అధికంగా ఉంది. ఇందులో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య కేవలం 16.8 శాతం మాత్రమే. కలప-కార్క్ పరిశ్రమ, కాగితం-గుజ్జు పరిశ్రమ, తయారీ-రీసైక్లింగ్ పరిశ్రమలో కూడా కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య తక్కువగానే ఉంటోంది.

2002-03తో పోలిస్తే కాగితం-గుజ్జు పరిశ్రమ, వస్త్ర పరిశ్రమ మినహా అనేక పరిశ్రమల్లో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య పెరుగుతోంది. కోక్, రిఫైన్డ్ పెట్రోలియం, అణు ఇంధన పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుల వాటా అత్యధికంగా 58.1 పర్సంటేజ్ పాయింట్లు పెరిగింది. ఇతర మెటాలిక్ ఖనిజ పరిశ్రమలు, ప్రాథమిక లోహాలు, ఇతర కల్పిత లోహ ఉత్పత్తుల పరిశ్రమల్లో కూడా కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య బాగానే పెరిగింది. మూలధన ప్రోత్సాహక పరిశ్రమల్లో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఓ కార్యాచరణ పత్రం తెలిపింది. నిపుణుల అవసరం ఎక్కువగా ఉన్న కర్మాగారాల్లో కూడా ఇదే ధోరణి కన్పించడం గమనార్హం.

రాష్ట్రాల వారీగా...

వివిధ రాష్ట్రాల్లో పారిశ్రామిక శ్రామికశక్తి కూర్పులో వైవిధ్యం కన్పిస్తోంది. 2021-22లో కాంట్రాక్ట్ కార్మికుల వాటా త్రిపురలో అత్యధికంగా 85.8 శాతంగా ఉంది. అరుణాచల్ ప్రదేశ్‌లో వీరి వాటా కేవలం 9.7 శాతం మాత్రమే. బీహార్ (68.6 శాతం), తెలంగాణ (64.9 శాతం), మేఘాలయ (62 శాతం), గోవా (61.7 శాతం), ఒడిశా (58.4 శాతం) రాష్ట్రాల్లో కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పనిచేస్తుండగా మణిపూర్ (11.5 శాతం), కేరళ (21.4 శాతం), తమిళనాడు (23.1 శాతం), పంజాబ్ (30.6 శాతం) వంటి రాష్ట్రాల్లో తక్కువ సంఖ్యలో పనిచేస్తున్నారు. గత 20 సంవత్సరాల కాలంలో పలు రాష్ట్రాల్లో కాంట్రాక్ట్ కార్మికుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. అయితే ఆ పెరుగుదల రాష్ట్రాల మధ్య ఒకేలా లేదు. జార్ఖండ్‌లో అత్యధికంగా 40 పర్సంటేజ్ పాయింట్లు (22 శాతం నుంచి 53 శాతానికి) పెరిగింది. ఉత్తరాఖండ్‌లో వారు 24 శాతం నుంచి 54 శాతానికి పెరిగారు.

చైనాపై ప్రభావం చూపని క్రౌడ్ స్ట్రైక్



బీజింగ్ : రెండ్రోజుల క్రితం మైక్రోసాఫ్ట్ విండోస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య ప్రపంచాన్ని కుదిపేసింది. దీని కారణంగా ప్రపంచ వ్యాప్తంగా విమానయాన సేవలు, బ్యాంకులు, వివిధ వ్యాపార కార్యకలాపాలు నిలిచిపోయాయి. కంప్యూటర్లలో బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్ కనిపించడంతో సిస్టమ్‌లు షట్‌డౌన్ / రీస్టార్ట్ అయ్యాయి. కాని, చైనాపై ఈ ప్రభావం పెద్దగా కనిపించలేదు. అక్కడి విమాన సర్వీసులు, బ్యాంకులు ఎప్పటిలాగే కొనసాగాయి. క్రౌడ్ స్ట్రైక్ అప్‌డేట్ చేయడంతోనే సాంకేతిక సమస్య తలెత్తినట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. క్రౌడ్ స్ట్రైక్ అనేది అమెరికాకు చెందిన ఓ సైబర్ సెక్యూరిటీ సంస్థ. విండోస్‌తోపాటు దిగ్గజ ఐటి సంస్థలకు అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీని అందిస్తుంటుంది. కాని, చైనాలో మాత్రం చాలా తక్కువ కంపెనీలే క్రౌడ్ స్ట్రైక్‌ను వినియోగిస్తున్నాయి. అది కూడా చైనా వేదికగా పనిచేస్తున్న కొన్ని అమెరికా సంస్థలు మాత్రమే దీనిని వాడుతున్నాయి. దీంతో ఈ సమస్య చైనాపై పెద్దగా ప్రభావం చూపలేదు. మరో ప్రధాన కారణం.. చైనాలోని మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సర్వీసులను స్థానిక భాగస్వామి అయిన 21 వయానెట్ నిర్వహిస్తోంది. చైనా నిబంధనల ప్రకారం.. గ్లోబల్ క్లౌడ్ సర్వీసులను అక్కడి స్థానిక సంస్థలే నిర్వహించాల్సి ఉంటుంది. అందుకే మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సేవలను 21 వయానెట్‌కు అప్పగించింది. ఇదువల్ల మైక్రోసాఫ్ట్ కార్యకలాపాలు మిగతా దేశాలతో పోలిస్తే చైనాలో భిన్నంగా ఉంటాయి. అంతేకాకుండా ఇతర దేశాల్లో సైబర్ ముప్పుగానీ, ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు వాటి ప్రభావం చైనాపై పడకుండా చైనా సొంతంగా పటిష్ఠ సాంకేతిక వ్యవస్థను అభివృద్ధి చేసుకుంది. ఈ కారణం వల్లే సాంకేతిక సమస్యతో ప్రపంచమంతా ఉక్కిరిబిక్కిరి అయినా చైనాలో దాని ప్రభావం నామమాత్రంగానే ఉంది. విండోస్‌లో తలెత్తిన క్రౌడ్ స్ట్రైక్ సమస్య ప్రపంచ వ్యాప్తంగా 8.5 మిలియన్ల కంప్యూటర్లపై పడినట్లు మైక్రోసాఫ్ట్ వెల్లడించింది. వందలాది మంది ఇంజినీర్లను, నిపుణులను వినియోగదారుల దగ్గరకి వెళ్లి సేవలు పునరుద్ధరించేలా కృషి చేసినట్లు తెలిపింది.

గాజాలో హత్యకు గురైన గర్భిణి

- కడుపులో నుంచి శిశువును రక్షించారు

గాజా : హత్యకు గురైన గర్భిణి కడుపులో నుంచి తొమ్మిది నెలల శిశువును రక్షించిన ఘటన గాజాలో చోటు చేసుకుంది. శనివారం గాజాలోని ఒక శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ దాడుల్లో 24 మంది మరణించినారు. ఈ దాడుల్లో ఓలా అద్నాన్ అనే గర్భిణి కూడా తీవ్రంగా గాయపడ్డారు. అయితే ఆసుపత్రికి తీసుకుని వెళ్లినా ఆమెను రక్షించలేకపోయారు. అయితే అల్ట్రా సౌండ్ స్కానింగ్‌లో శిశువు గుండె కొట్టుకోవడం గుర్తించిన వైద్యులు శస్త్రచికిత్స ద్వారా శిశువును బయటకు తీశారు. తరువాత శిశువును దీర్ అల్ బాలాలోలని ఆసుపత్రికి తరలించారు.

కోటా రద్దు

- బంగ్లా సుప్రీంకోర్టు తీర్పు

ఢాకా : ఇటీవల దేశవ్యాప్తంగా భారీ అల్లర్లకు దారి తీసిన ప్రభుత్వ ఉద్యోగాల్లో అనేక కోటాలను బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు ఆదివారం రద్దు చేసింది. హైకోర్టు కోర్టు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేస్తూ.. ప్రభుత్వ ఉద్యోగాల్లో 93 శాతం ఉద్యోగాలు మెరిట్ ప్రాతిపదికన అభ్యర్థులకు అందుబాటులో ఉంచాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ విషయాన్ని బంగ్లాదేశ్ అటార్నీ జనరల్ ఎ.ఎం. అమీన్ ఉద్దీన్ మీడియాకు వెల్లడించారు. సుప్రీం తీర్పుతో దేశంలో సాధారణ పరిస్థితులు మళ్లీ నెలకొంటాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో కొన్ని రోజులుగా జరుగుతున్న హింసాత్మక ఘటనలతో తమకు ఎలాంటి సంబంధం లేదని విద్యార్థులు స్పష్టం చేసినట్లు ఆయన చెప్పారు. హింసాకాండ వెనుక ఉన్నవారెవరో గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్ విముక్తి కోసం సాగిన పోరులో ప్రాణ త్యాగం చేసిన సమరయోధుల కుటుంబాలకు ఉద్యోగాల్లో కోటాను 5 శాతానికి తగ్గించాలని సుప్రీంకోర్టు తాజాగా ఆదేశించినట్లు అటార్నీ జనరల్ తెలిపారు. మిగిలిన రెండు శాతం కోటాలు ఇప్పటికీ వెనుకబడిన తరగతులు, వికలాంగులకు ఉన్నాయని అన్నారు. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు సుప్రీంకోర్టు ఈ తీర్పు వెలువరించింది. ఇక నుంచి ప్రభుత్వ ఉద్యోగాల్లో 93 శాతం రిక్రూట్‌మెంట్లు మెరిట్ ఆధారంగానే జరగాలని ఆదేశించిన సుప్రీంకోర్టు. మిగిలిన ఏడు శాతం కోటాలో రిజర్వేషన్లకు అనుమతించింది. దీనికి సంబంధించి వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని కూడా సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణ సమయంలో విద్యార్థుల తరపున మాట్లాడేందుకు ఐదుగురు న్యాయవాదులకు కోర్టు అనుమతించింది. సుప్రీంకోర్టు విచారణలో పాల్గొన్న తొమ్మిది మంది న్యాయవాదులలో ఎనిమిది మంది దిగువ కోర్టు ఉత్తర్వులను రద్దు చేయడాన్ని సమర్థించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో అమలవుతున్న కోటాలను ప్రధానమంత్రి షేక్ హసీనా ప్రభుత్వం 2018లో రద్దు చేసింది. అయితే హైకోర్టు వీటిని గత నెలలో పునరుద్ధరించడంతో బాటు మొత్తం కోటాలను 56 శాతంగా నిర్ణయించింది. అసలే నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్న పరిస్థితుల్లో హైకోర్టు తీర్పు అగ్నికి ఆజ్యం పోసినట్లైంది. ఉద్యోగాల్లో కోటాను వ్యతిరేకిస్తూ విద్యార్థులు పెద్దయెత్తున వీధుల్లోకివచ్చారు. ఈ సందర్భంగా చెలరేగిన హింస, కాల్పుల్లో ఇప్పటివరకు 115 మంది విద్యార్థులు చనిపోయారు. గురువారం నుంచి ఇంటర్నెట్, టెక్స్ట్ మేసేజ్ సేవలను బంగ్లాదేశ్ ప్రభుత్వం నిలిపివేసింది. రాజధాని ఢాకాలో సైనికులు పెట్రోలింగ్ నిర్వహించారు. అనేక ప్రాంతాల్లో ఆర్మీ చెక్ పాయింట్లు ఏర్పాటు చేశారు.



కేంద్ర మంత్రి షెకావత్‌తో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్

యునెస్కో సదస్సు ప్రారంభం

- రాష్ట్రం నుంచి పర్యాటక మంత్రి దుర్గేష్ హాజరు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వారసత్వ కట్టడాల పరిరక్షణ ధ్యేయంగా పని చేసే యునెస్కో ప్రపంచ వారసత్వ కమిటీ 46వ సెషన్‌ను ఆదివారం న్యూఢిల్లీ భారత్ మండపంలో ప్రారంభమైంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ నెల 31 వరకు జరిగే ఈ సమావేశాలకు భారత్ ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి. యునెస్కో డైరెక్టర్ జనరల్ ఒడ్రే అజౌలె, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో పాటు 150కి పైగా దేశాల నుంచి 2000 మందికి పైగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రతినిధులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హాజరయ్యారు.

పర్యాటక ప్రాజెక్టులకు నిధులివ్వండి

కాగా కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర షెకావత్‌తోనూ మంత్రి కందుల దుర్గేష్ సమావేశమయ్యారు. ఈ భేటీ అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యాటక ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని షెకావత్‌ను కోరినట్లు తెలిపారు. ఏపి బడ్జెట్ సమావేశాల తరువాత మరోసారి కేంద్ర మంత్రితో భేటీ కానున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధికి సమగ్ర కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

స్వేచ్ఛకు ముప్పు

- మీడియాపై పెత్తనం కోసం ప్రభుత్వం చర్యలు
- పార్లమెంటులో ప్రస్తావించండి
- ప్రతిపక్ష నేత రాహుల్‌కు ఎడిటర్స్ గిల్డ్ లేఖ

న్యూఢిల్లీ : గత కొన్ని సంవత్సరాలుగా మీడియాని తన చెప్పుచేతల్లో ఉంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చట్టపరమైన చర్యలు చేపడుతోందని ఎడిటర్స్ గిల్డ్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశాన్ని రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో లేవనెత్తాలని ప్రతిపక్షాలను కోరింది. ఈ మేరకు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఎడిటర్స్ గిల్డ్ ఓ లేఖ రాసింది. ప్రాథమిక స్వేచ్ఛకు ముప్పు పెరుగుతోందని అందులో తెలియజేసింది. మీడియా స్వేచ్ఛకు సంబంధించి అమలులో ఉన్న నాలుగు చట్టాలు, వాటి పరిమితులను ఆ లేఖలో వివరించింది. 'గత సంవత్సరాల్లో ప్రభుత్వం డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ చట్టాన్ని తీసుకొచ్చింది. ఇందులోని అనేక నిబంధనలు పాత్రికేయులు తమ విధులు నిర్వర్తించేందుకు అవరోధం కలిగిస్తాయి. గత సంవత్సరమే తీసుకొచ్చిన బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ రెగ్యులేషన్ బిల్లు కూడా పత్రికా స్వేచ్ఛకు సవాళ్లు విసురుతోంది. మీడియాను కట్టడి చేసేందుకు, తన అదుపాజ్ఞల్లో ఉంచుకునేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు శాసనపరమైన చర్యలు చేపట్టింది. వీటిలో కొన్నింటికి పార్లమెంట్ ఆమోదం కూడా లభించింది. చట్టాల రూపకల్పన, ఆమోదంతో సంబంధిత వర్గాలు, సంస్థలతో చర్చించలేదు. పార్లమెంటులో వాటిపై పరిశీలన జరగలేదు. నిబంధనలన్నీ అస్పష్టంగా ఉన్నాయి. వాటి పరిధిని బాగా విస్తరించారు. చట్టబద్ధమైన పాత్రికేయ కార్యకలాపాలను నియంత్రించేందుకు ఈ నిబంధనలను దుర్వినియోగం చేసే అవకాశం ఉంది. నిబంధనలు ప్రభుత్వానికి, ప్రభుత్వ సంస్థలకు విశేషాధికారాలు కట్టబెట్టాయి. అవి తీసుకునే చర్యలు జర్నలిజం, పత్రికా స్వేచ్ఛపై ప్రభావం చూపుతున్నాయి' అని ఆ లేఖలో ఎడిటర్స్ గిల్డ్ వివరించింది. పత్రికా స్వతంత్రత, భావ ప్రకటనా స్వేచ్ఛ రక్షణకు ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోలేదని ఎడిటర్స్ గిల్డ్ అభిప్రాయపడింది. ముఖ్యంగా 2021వ సంవత్సరపు ఐటీ నిబంధనలకు చేసిన సవరణలపై పత్రికా సంస్థలు, ప్రతిపక్ష పార్టీలు, పాత్రికేయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సవరణలను ఎడిటర్స్ గిల్డ్, న్యూస్ బ్రాడ్‌కాస్ట్ అండ్ డిజిటల్ అసోసియేషన్, హాస్య నటుడు కునాల్ క్రమ ఇప్పటికే న్యాయస్థానంలో సవాలు చేశారు. ఈ సవరణలు భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి చేస్తున్నాయని వారు ఆరోపించారు.

2050 నాటికి దేశంలో వృద్ధుల సంఖ్య రెట్టింపు

- యుఎన్ఎఫ్‌పిఎ భారత్ చీఫ్ ఓజ్‌నర్



న్యూఢిల్లీ : 2050 నాటికి దేశంలో వృద్ధుల సంఖ్య రెట్టింపు అవుతుందని యునైటెడ్ నేషన్స్ ఫర్ పాప్యులేషన్ యాక్టివిటీస్ (యుఎన్ఎఫ్‌పిఎ) భారత విభాగం అధిపతి ఆండ్రూ ఓజ్‌నర్ తెలిపారు. వృద్ధుల సంఖ్య పెరగనున్నందున వారి ఆరోగ్య రక్షణ, గృహనిర్మాణం, పెన్షన్‌పై దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని ఆమె చెప్పారు. ముఖ్యంగా ఒంటరిగా నివసిస్తూ, పేదరికంతో జీవిస్తున్న వృద్ధ మహిళల విషయంలో శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ నెల 11న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆండ్రూ ఓజ్‌నర్ పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడుతూ సమ్మిళిత వృద్ధిని వేగవంతం చేయడానికి భారత ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. అరవై సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసున్న వారి సంఖ్య 2050 నాటికి 34.6 కోట్లకు చేరుతుందని ఓజ్‌నర్ తెలిపారు. భారత్‌లో 10-19 సంవత్సరాల మధ్య వయసున్న వారి సంఖ్య 25.2 కోట్లుగా ఉన్నదని ఆమె చెప్పారు. దేశాన్ని సమ్మిళిత వృద్ధి దిశగా ముందుకు నడిపించాలంటే ఆరోగ్యం, విద్య, ఉద్యోగ శిక్షణపై పెట్టుబడులు పెంచాలని, లింగ సమానత్వాన్ని సాధించాలని సూచించారు. 2050 నాటికి దేశంలో యాభై శాతం పట్టణ ప్రాంతంగానే ఉంటుందని అంటూ మురికివాడలను అభివృద్ధి చేయడానికి, వాయు కాలుష్యాన్ని అడ్డుకోవడానికి, పర్యావరణ సంబంధమైన సమస్యలను పరిష్కరించడానికి స్మార్ట్ సిటీలు నిర్మించాలని, పటిష్ఠమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, అందుబాటు ధరల్లో గృహ నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. మహిళలు సురక్షితంగా, భద్రంగా ఉండేలా చూసేందుకు పట్టణ ప్రణాళికలు రూపొందించుకోవాలని, వారికి ఆరోగ్య రక్షణ కల్పించాలని, విద్య, ఉద్యోగ అవకాశాలు అందించాలని ఓజ్‌నర్ కోరారు. లింగ సమానత్వాన్ని సాధించాలని, మహిళలు నాణ్యమైన జీవితాన్ని పొందేలా చూడాలని చెప్పారు. వలసవాదులు, ఒంటరి మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అంటూ వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆండ్రూ ఓజ్‌నర్ సూచించారు.

మణిపూర్‌లో వ్యక్తి కాల్చివేత

ఇంఫాల్ : మణిపూర్‌లోని ఇంఫాల్ తూర్పు జిల్లాలో ఒక వ్యక్తిని కాల్చిచంపారు. లామ్‌లైన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టెక్చామ్ శనివారం ఈ హత్య జరిగినట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. మృతుడ్ని ఆర్‌కె ఫుతిబి సింగ్‌గా గుర్తించారు. కళ్లకు గంతలు కట్టి, చేతులు వెనుకకు కట్టి, అతి సమీపం నుంచి కాల్చిచంపారు. కాగా, ఈ హత్యకు తామే బాధ్యులమని నిషేధ కెసిపి (ప్రోగ్రెసివ్) సంస్థ ప్రకటించింది. మాజీ ఉగ్రవాదైన సింగ్ భద్రతా సిబ్బంది కోసం గూఢాచర్యం చేస్తున్నాడని ఆరోపించింది. కాగా, మరోవైపు కెసిపి(తైబంగన్‌బా)కు చెందిన ఒక ఉగ్రవాదిని కక్చింగ్ జిల్లాలోని తేజ్‌పూర్ ముఖ లైకైలో అరెస్టు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. 33 ఏళ్ల నింగ్‌థౌజం దోపిడీ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు చెప్పారు.

అఖిలపక్ష భేటీలో ప్రత్యేక హోదా హోరు

(మొదటి పేజీ తరువాయి)

ఎంపిలు విజయసాయి రెడ్డి, మిథున్ రెడ్డి, బిఆర్ఎస్ ఎంపి కె.ఆర్ సురేష్ రెడ్డి, డిఎంకె ఎంపిలు టిఆర్ బాలు, తిరుచ్చి శివ, సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్, సిపిఐ ఎంపి సంతోష్ కుమార్, ఎల్‌జెపి నేత, కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, అనుప్రియ పటేల్, ఎస్‌పి ఎంపి రాం గోపాల్ యాదవ్, ఆప్ ఎంపి సంజయ్ సింగ్, ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసి, ఎన్‌సిపి నేత ప్రఫుల్ పటేల్, ఆర్‌జెడి ఎంపి అభయ్ కుష్వాహ, జెడియు ఎంపి సంజయ్ ఝా సహ పలు పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

హోదా ఒక్కటే ఏకైక పరిష్కారం : విజయసాయిరెడ్డి

అఖిలపక్ష సమావేశం అనంతరం వైసిపి నేత విజయసాయిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ "ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఒక్కటే రాష్ట్ర అభివృద్ధికి ఏకైక పరిష్కారం. దీనిపై అధికార టిడిపి మౌనంగా ఉంది. టిడిపి ప్రత్యేక హోదా అంశాన్ని లేవనెత్తడం లేదు. బిజెపితో రాజీ కుదుర్చుకున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి బుధవారం ఢిల్లీలో ధర్నా చేయనున్నారు" అని అన్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం : లావు శ్రీకృష్ణదేవరాయలు

టిడిపి పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు "ఇది ఒకటి రెండు డిమాండ్ల విషయం కాదు. అనేక సమస్యలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితిపై పార్లమెంట్‌లో శ్వేతపత్రం పెడతాం. మాకు ఖచ్చితంగా కేంద్ర ప్రభుత్వం మద్దతు కావాలి" అని అన్నారు.

'హోదా'పై టిడిపి మౌనం విచిత్రం : జైరాం రమేశ్

మరోవైపు ఏపికి ప్రత్యేక హోదా ప్రకటించాలని ఎన్‌డిఎ భాగస్వామ్యపక్షం టిడిపి డిమాండ్ చేయకపోవడాన్ని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ తప్పుపట్టారు. అఖిలపక్ష సమావేశంలో జెడియు, వైసిపి వరుసగా బీహార్, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక కేటగిరీ హోదాను డిమాండ్ చేశాయని, అయితే "విచిత్రంగా" టిడిపి ఈ విషయంపై మౌనం ప్రదర్శించిందని అన్నారు. ఎన్నికల అనంతరం ఏపిలో చెలరేగుతున్న హింస, ప్రతిపక్షంపై జరుగుతున్న దాడులపై ఈ సమావేశంలో వైసిపి ప్రస్తావించింది.

హోదా కుదరకపోతే ప్రత్యేక ప్యాకేజీ : జెడియు

జెడియు ఎంపి సంజయ్ ఝా మాట్లాడుతూ "మేము బీహార్‌కు ప్రత్యేక హోదాను డిమాండ్ చేస్తున్నాము. మేము ఈ సమస్యను చాలా కాలంగా లేవనెత్తుతున్నాం. ఇందులో ఏదైనా సాంకేతిక సమస్య ఉంటే, మాకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వండి" అని అన్నారు.

హోదా సమయం ఆసన్నమైంది : బిజెడి

బిజెడి నేత సస్మిత్ పాత్ర మాట్లాడుతూ తమ పార్టీ ఒరిస్సాకు ప్రత్యేక హోదాను డిమాండ్ చేస్తుందన్నారు. "ప్రత్యేక హోదాపై ప్రభుత్వ వైఖరిని పున్ణపరిశీలించాల్సిన సమయం ఆసన్నమైంది. బిజెడి, ఆర్‌జెడి, జెడియు, ఎల్‌జెపి, వైసిపి అన్నీ తమ తమ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కావాలని అడిగాయి" అని ఆయన అన్నారు.

కనీసం హోదా అయినా ఇవ్వండి : సిపిఎం

ప్రత్యేక హోదా కావాలని ఆంధ్రప్రదేశ్, బీహార్, ఒడిశా రాష్ట్రాల నుంచి వస్తున్న డిమాండ్‌ను అఖిలపక్ష సమావేశంలో రాజ్యసభలో సిపిఎం పక్ష ఉపనేత జాన్ బ్రిట్టాస్ సమర్థించారు. 'ఎన్‌డిఎలోని చాలా మంది సభ్యులు, ఇతర పక్షాల సభ్యులు తమతమ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కావాలన్న డిమాండ్లను నెరవేర్చాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని సిపిఎం నేత అన్నారు. ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇవ్వకపోయినా..వాటిని కనీసం రాష్ట్రాల హోదా అన్న సంగతి అయినా మోడీ సర్కార్ గుర్తించాలని ఆయన హితవు పలికారు.

ప్రస్తుతం ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలను కేంద్రం ఏమాత్రమూ పరిగణనలోకి తీసుకోవటం లేదని విమర్శించారు. సమాఖ్య సూత్రాలను గాలికి వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రాల అధికారాలను హరించటం, రాష్ట్రాల్లో పాలనను కూలదోయడానికి గవర్నర్లను బరిలో నిలపడం దారుణమని ఆయన పేర్కొన్నారు.

రేపు కేంద్ర బడ్జెట్

నేటి నుంచి ప్రారంభమయ్యే సమావేశాల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. నీట్ పేపర్ లీక్ కేసు నుంచి రైల్వే భద్రత వరకు సమస్యలపై ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ఐక్య ప్రతిపక్షం సిద్ధమైంది. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. ఆగస్టు 12 వరకు 19 రోజులు సమావేశాలు జరుగుతాయి. ఈ సమావేశాల్లో ఆరు బిల్లులను సమర్పించాలని, కేంద్ర బడ్జెట్, జమ్మూ కాశ్మీర్ బడ్జెట్‌కు పార్లమెంటు ఆమోదం పొందనున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంటులో ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టనున్నారు.



అల్లూరి జిల్లా చింతూరు మార్కెట్ సెంటర్‌లోకి చొచ్చుకువచ్చిన వరద నీరు



దేవీపట్నంలో గోదావరి ఉధృతికి పూర్తిగా నీట మునిగిన గండిపోచమ్మ ఆలయం

ముంపులో పలు గ్రామాలు

(మొదటి పేజీ తరువాయి)

విఆర్.పురం మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సిపిఎం జిల్లా నాయకులు పర్యటించారు. బాధితులకు తక్షణ పునరావాస, సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

వరద నీరు పెరగడంతో తెలంగాణలోని భద్రాచలం స్నాన ఘట్టాల ప్రాంతంలోని మెట్లు నీట మునిగాయి. చర్ల మండలం వద్ద ఈత వాగుపై నుంచి వరద నీరు పారడంతో నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దుమ్ముగూడెం మండలం వద్ద సీతవాగు, గుబ్బల మంగి వాగు ఉధృతంగా ప్రవహించడంతో పర్ణశాల వద్ద నార చీరల ప్రాంతం వరద నీటిలో మునిగింది. భద్రాచలం నుంచి ఛత్తీస్‌గఢ్, ఒడిశాలకు వెళ్లే ప్రధాన రహదారి చట్టి వద్ద వరద నీరు చేరడంతో తెలంగాణ నుంచి ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి వరద పోటుతో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతమైన టేకులగూడెం సమీపంలో 163వ నెంబరు జాతీయ రహదారిపై వరద నీరు చేరింది. దీంతో, ఈ రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు స్తంభించాయి. అల్లూరి జిల్లాలోని చీకటివాగు, సోకిలేరు వాగు, చంద్రవంక వాగులు పొంగిపొర్లడంతో కొమ్మూరు, మామిల్లగూడెం, రేగులపాడు, బోజ్రాయిగూడెం తదితర గ్రామాలకు చింతూరు మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. సోకిలేరువాగు ఉగ్రరూపం దాల్చడంతో 30 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. చూటూరు, ముకునూరు, నర్సింగపేట, జల్లివారిగూడెం, ఏజీ కోడేరు, తిమ్మిరిగూడెం, కుందలూరు, ఉలుమూరు తదితర గ్రామాలకు రవాణా నిలిచిపోయింది. ఘాట్ రోడ్డులో చెట్లు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున మారేడుమిల్లి, చింతూరు. రాజమండ్రికి వెళ్లే వాహనాలను సాయంత్రం ఏడు గంటల నుండి ఉదయం ఆరు గంటల వరకు అధికారులు ముందస్తుగా నిలిపివేస్తున్నారు. ఎటపాక మండలం నెల్లిపాక-వీరాయిగూడెం గ్రామాల మధ్య రహదారిపైకి వరద నీరు చేరింది. గన్నవరంలో ముమ్మనేని లక్ష్మీ సుభద్ర పెంకుటిల్లు కూలింది. చింతూరు మండలం చట్టి వద్ద కొమ్మూరు వాగు ఉధృతికి జాతీయ రహదారి 30పైకి వరద నీరు చేరడంతో భద్రాచలం, చింతూరు, రాజమండ్రి, కాకినాడ తదితర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జికె.వీధి మండలం సీలేరు జెన్‌కో చెక్‌పోస్టు వద్ద ప్రధాన రహదారిలో భారీ వృక్షం కూలడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రాజవొమ్మంగిలోని ఒట్టి గెడ్డ పొంగి ప్రవహించడంతో శ్రీరామనగర్, శాంతినగర్, వయ్యాడ, బూరుగుపల్లి, ముంజవాప్పాడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి, మారేడుమిల్లి సిబిఐటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జలతరంగిణి, అమృతధార జలపాతాలు, గుడిసె వంటి పర్యాటక ప్రాంతాల సందర్శనను జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలతో నిలుపుదల చేశారు. హుకుంపేట మండలంలోని చీడిపుట్టు కల్వర్టుపై నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అనంతగిరి మండలం కటికి, చిట్టంపాడు, సరియా జలపాతాల ఉధృతి పెరిగింది.

పొంగిపొర్లుతున్న కొండవాగులు, రిజర్వాయర్లు, చెరువులు

ఏలూరు జిల్లా పోలవరం మండలంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండవాగులు, రిజర్వాయర్లు, చెరువులు పొంగి పొర్లుతున్నాయి. గుంజవరం, పేడ్రాల కాలువలు, కొండవాగుల జలాలు పొంగి గుంజవరం కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. ముదినేపల్లి మండలంలోని అన్ని మేజర్, మీడియం, మైనర్ డ్రెయిన్లు పరవళ్లు తొక్కుతున్నాయి. ఆచంట మండలం నిక్కల తాడేరు డ్రెయిన్లు ఉధృతంగా ప్రవహించడంతో సుమారు 1500 ఎకరాల్లో వరి నాట్లు నీట మునిగాయి. అడుగు మేర నీరు నిలిచిపోయింది. ఈ నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో రైతులు తీవ్రంగా కలత చెందుతున్నారు. పెనుమంత్రలో 2,430 ఎకరాల్లో వరి నాట్లు, 42 ఎకరాల్లో నారు మడులు నీట మునిగాయి. నాలుగు రోజులుగా నీరు నిల్చి ఉండడంతో నారు మడులు కుళ్లి దెబ్బతింటున్నాయి.

కాటన్ బ్యారేజీ వద్ద 10.50 అడుగుల నీటిమట్టం

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 10.50 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఇన్‌ఫ్లో ఎనిమిది లక్షల క్యూసెక్కులు ఉంది. బ్యారేజీ 175 గేట్లను పైకిలేపి 8,18,853 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి నీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వ్యవసాయ అవసరాల నిమిత్తం డెల్టా కాలువలకు 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. రానున్న 24 గంటల్లో వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న నీటి ప్రవాహం

కృష్ణా పరివాహక ఎగువ రాష్ట్రమైన కర్ణాటక పరిధిలోని ఆల్మట్టి డ్యాం నిండుకుండలా మారడంతో తెలుగు రాష్ట్రాల వైపు కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. తెలంగాణ పరిధిలో జూరాలకు భారీగా వరద నీరు రావడంతో గేట్లను ఎత్తి శ్రీశైలం జలాశయానికి నీటిని వదులుతున్నారు. ఎగువ జూరాల నుండి 84,238 క్యూసెక్కులు, విద్యుత్తు ఉత్పాదన ద్వారా 30,407 క్యూసెక్కుల నీటితో కలిపి 1,14,645 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. జలాశయం నీటిమట్టం 885 అడుగులకుగాను ప్రస్తుతం 822.50 అడుగులకు చేరింది. నీటి నిలువ సామర్థ్యం 215 టిఎంసిలకుగాను ప్రస్తుతం 42.7386 టిఎంసిలు ఉన్నాయి. కుడిగట్టు విద్యుత్తు కేంద్రంలో విద్యుదుత్పత్తి నిలిపివేశారు. ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్తు కేంద్రంలో గడిచిన 24 గంటలలో 817 క్యూసెక్కుల నీటితో 0.372 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశారు. ఇదే నీటి ప్రవాహం కొనసాగితే మరో వారం రోజుల్లో శ్రీశైలం జలాశయం గరిష్ట నీటి మట్టానికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద కొనసాగుతున్న వరద

ప్రకాశం బ్యారేజీ వద్ద వరద కొనసాగుతోంది. కృష్ణా నది పరీవాహన ప్రాంతంతోపాటు తెలంగాణాలో కురిసిన వర్షాలతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నారు. మునేరు వాగు నుండి వచ్చిన నీరు కృష్ణా నదిలో కలుస్తోంది. దీంతో, ప్రకాశం బ్యారేజికి వరద నీరు వచ్చి చేరుతోంది. వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో 13,634 క్యూసెక్కులు ఉంది. 12,325 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి, 1,309 క్యూసెక్కుల నీటిని కాల్వలకు వదులుతున్నారు.




బాలోత్సవ భవన ప్రాంగణంలో వైతాళికుల చిత్రపటాలను ఆవిష్కరిస్తున్న తెలకపల్లి రవి, చిత్రంలో విజ్ఞాన కేంద్రాల బాధ్యులు పి. మధు, భూపతి వెంకటేశ్వర్లు, జి నరసింహారావు తదితరులు

ప్రగతిశీల సమాజం మనందరి బాధ్యత

వైతాళికుల చిత్రపటాల ఆవిష్కరణ సభలో తెలకపల్లి రవి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగు నాట సామాజిక, సాంస్కృతిక పురోగమనానికి బాటలు వేసిన వారిని నిరంతరం గుర్తు చేసుకోవటంతో పాటు వారి చూపిన దారిలో ప్రగతిశీల సమాజాన్ని నిర్మించుకోవడం మనందరి బాధ్యత అని ప్రముఖ సాహితీ విశ్లేషకులు తెలకపల్లి రవి అన్నారు. ఆదివారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రూపొందించిన రెండు తెలుగు రాష్ట్రాల సమాజ పురోగమన సంస్కృతి వైతాళికుల చిత్రాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. వివిధ కాలాల్లో సమాజ వికాసానికి, విజ్ఞానానికి కొత్త దారులు ఏర్పరిచిన పోతులూరి వీరబ్రహ్మం, వేమన, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు వెంకట రామమూర్తి, చిలకమర్తి లక్ష్మీ నరసింహం, బండారు అచ్చమాంబ, కొమర్రాజు లక్ష్మణరావు, ఉన్నవ లక్ష్మీనారాయణ, బళ్లారి రాఘవ, ముద్దు నరసింహనాయుడు, కట్టమంచి రామలింగారెడ్డి, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, కుసుమ ధర్మన్న, త్రిపురనేని రామస్వామి, తాపీ ధర్మారావు, గరిమెళ్ల సత్యనారాయణ, గుడిపాటి వెంకటాచలం, గుర్రం జాషువా, బోయి భీమన్న, సురవరం ప్రతాపరెడ్డి, సుద్దాల హనుమంతు, కనపర్తి వరలక్ష్మమ్మ, ముగ్దూం మొహియిద్దీన్, సుంకర సత్యనారాయణ, కొడవగంటి కుటుంబరావు, శ్రీశ్రీ, వాసిరెడ్డి భాస్కరరావు, వట్టికోట ఆళ్వార్‌స్వామి, షేక్ నాజర్, దాశరథి కృష్ణమాచార్య, ఆరుద్ర చిత్రపటాలను తెలకపల్లి రవి, డాక్టర్ కెఎన్ మల్లీశ్వరి ఆవిష్కరించారు. అనంతరం యువ రచయిత అనీల్ డ్యానీ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథి తెలకపల్లి రవి మాట్లాడుతూ, సమాజాన్ని నిద్రపుచ్చేందుకు ఎందరో వుంటారని, మేల్కొలిపేందుకు మాత్రం కొందరే వుంటారని అన్నారు. అలాంటి వైతాళికుల ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు ఈ చిత్రపటాలు నిరంతర ప్రేరణ ఇస్తాయని పేర్కొన్నారు. దేశంలో స్వాతంత్ర్య పోరాటానికి చాలా ముందు నుంచే రాజా రామ్మోహన్‌రాయ్, కందుకూరి లాంటి వారు దురాచారాల నిర్మూలనకు, సంఘ సంస్కరణకూ పోరాడారని తెలిపారు. సమాజంలో వేళ్లూనుకు పోయిన మూఢ నమ్మకాలు, వితంతు వివాహాలు, వివక్ష తదితర అంశాలపై పోరాటం చేశారని తెలిపారు. కందుకూరి, చలం, కనుపర్తి వరలక్ష్మమ్మ తదితరులు మహిళల హక్కుల పోరాటం చేస్తే, గిడుగు, గురజాడ వంటి వారు వాడుక భాష కోసం యుద్ధం చేశారని తెలిపారు. నాడు ఉన్నత విద్యావంతులైన వారు, విదేశాల్లో చదువుకొచ్చిన వారు సమాజంలో సంస్కరణలు, దేశస్వాతంత్ర్యం కోసం కృషి చేశారని అన్నారు. ఈ వైతాళికులు అందరూ కళను, సాహిత్యాన్ని ఒక ఆయుధంగా వాడి సంఘాన్ని సంస్కరించేందుకు పోరాటం చేశారని తెలిపారు. ఇప్పుడూ ప్రజాకళలు, ప్రజాసాహిత్యం సమాజ పురోగమనానికి దోహదపడాలని, తిరోగమన శక్తులను తిప్పికొట్టాలని అన్నారు.



సభలో మాట్లాడుతున్న తెలకపల్లి రవి ; వేదికపై పిన్నమనేని మురళీ కృష్ణ, వెన్నా వల్లభరావు, అనిల్, సత్యాజీ, గిరిధర్, అనిల్‌డ్యానీ, మల్లీశ్వరి, దాస్, రావిశారద, బాలాంత్రపు ప్రసూన

ప్రముఖ కథా, నవలా రచయిత డాక్టర్ కెఎన్ మల్లీశ్వరి మాట్లాడుతూ, ప్రస్తుతం సమాజంలో కొన్ని పోకడలు ప్రమాదకరంగా తయారయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత చదువులు చదివినవారు కూడా మత ఛాందసాన్ని పెంచి పోషించేలా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజాన్ని పురోగమనం వైపు తీసుకెళ్లేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. మరొక వక్త సత్యాజీ మాట్లాడుతూ, నాలుగొందల ఏళ్ల క్రితమే వీరబ్రహ్మం వంటి సంస్కర్తలు కులమతాలకు అతీతంగా మనుషులను కలుపుకొని పోతే, నేటి పాలకులు కులమత విద్వేషాలను రెచ్చగొట్టి లబ్ధి పొందాలని ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సామరస్యం, సమైక్యత, సమానత్వం, సౌభ్రాతృత్వ భావాలను అందించిన వైతాళికుల బాటలో ఉన్మాదశక్తులను ఎదుర్కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సాహితీ విమర్శకులు బాలాంత్రపు ప్రసూన మాట్లాడుతూ, ఈ చిత్రపటాలను ఏర్పాటు చేయడం స్ఫూర్తిదాయకంగా ఉందని అన్నారు. ఈ మహాభావుల చిత్రపటాలను విద్యార్థుల్లోకి తీసుకెళ్లి చైతన్యాన్ని పెంచాలని గ్రంథాలయ నిర్వాహకులు రావి శారద అన్నారు. సమాజ అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడ్డ వైతాళికులను ఇలా ఆవిష్కరించుకోవటం చాలా గొప్ప సందర్భమని అనువాదకులు డాక్టర్ వెన్నా వల్లభరావు పేర్కొన్నారు. సమాజ సంస్కరణ కోసం అహర్నిశలూ కృషి చేసిన వైతాళికుల చిత్రపటాలను సాహిత్యానికి కేంద్రమైన విజయవాడలో ఎంబివికె ఆవిష్కరించడం అభినందనీయమని అన్నారు.

అనంతరం ఈ చిత్రపటాలను రూపొందించిన ప్రముఖ చిత్రకారుడు అరసవల్లి గిరిధర్‌ను తెలకపల్లి రవి, మల్లీశ్వరి, ఇతర అతిథులు, ఎంబివికె నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. సజీవత ఉట్టిపడేలా స్ఫూర్తిదాయకమైన చిత్రాలను ఎంతో శ్రమకోర్చి రూపొందించినందుకు వక్తలందరూ గిరిధర్‌ని అభినందించారు. పలువురు ఆర్టిస్టులు గిరిధర్‌ని పుష్పగుచ్ఛాలిచ్చి, అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాగాయకుడు ఎస్ అనిల్, డాక్టర్ దాస్, ఎంబివికె కన్వీనర్ పిన్నమనేని మురళీకృష్ణ, క్రాంతి, గుండు నారాయణరావు, విజ్ఞాన కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. సభలో ప్రజానాట్యమండలి కళాకారులు జగన్, అనిఫ్ తదితరులు అభ్యుదయ గీతాలను ఆలాపించారు. చిత్రాలను పటాలను పలువురు ఆసక్తిగా తిలకించి, ఆయా వైతాళికులు నిర్వహించిన చారిత్రిక పాత్ర గురించి చర్చించుకున్నారు.


జెట్టి హారిక


తాడిబోయిన రవితేజ

ఉన్నత చదువులకువెళ్లి విగతజీవులయ్యారు

అమెరికా వెళ్లిన యువతి, యువకులు వేర్వేరు ఘటనల్లో మృతి

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)

ఉన్నత చదువుల కోసం వేర్వేరు కుటుంబాల నుంచి అమెరికా వెళ్లిన ఇద్దరు ప్రమాదవశాత్తూ మరణించారు. ఈ ఘటనలు గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలోని రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తెనాలిలోని ఐతానగర్‌కు చెందిన జెట్టి హారిక (25) వెటర్నరీ సైన్స్ పూర్తి చేసి ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌లో పీజీ చేసేందుకు గతేడాది ఆగస్టులో అమెరికా వెళ్లారు. ఒక్లహోమా సెంట్రల్ యూనివర్సిటీలో చదువుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున తోటి విద్యార్థులతో కలిసి కాలేజీకి కారులో వెళ్తుండగా వీరి వాహనాన్ని మరో వాహనం ఢీకొట్టింది. దీంతో హారిక అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషయాన్ని అక్కడి పోలీసుల ద్వారా తెలుసుకున్న తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. కుమార్తె మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు గుంటూరు ఎంపి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నారా లోకేష్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవ చూపాలని హారిక తల్లిదండ్రులు జెట్టి శ్రీనివాసరావు, నాగమణి వేడుకుంటున్నారు.

స్విమ్మింగ్ పూల్‌లో పడి యువకుడు మృతి

అమెరికాలో ఎంఎస్ చేసేందుకు వెళ్లిన మరో యువకుడు అక్కడ ప్రమాదవశాత్తూ స్విమ్మింగ్ పూల్‌లో జారి పడి మృతి చెందారు. ఐతానగర్‌కు చెందిన తాడిబోయిన రవితేజ (28) ఎంఎస్ చేసేందుకు గతేడాది ఆగస్టులో అమెరికా వెళ్లారు. టెక్సాస్ రాష్ట్రం ఆస్టిన్ నగరంలోని ఓ విశ్వవిద్యాలయంలో చదువుతున్నారు. ఈ నెల 18న మిత్రులతో కలిసి రవితేజ స్విమ్మింగ్ పూల్‌లోకి దిగారు. ఈత రాక నీట మునిగిపోయారు. స్నేహితులు ఆయనను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. అక్కడి నుంచి శనివారం రాత్రి సమాచారం రావడంతో కుటుంబ సభ్యులు విలవిల్లాడుతున్నారు. రవితేజ తండ్రి ఏడేళ్ల క్రితమే చనిపోగా, అప్పటి నుంచి తల్లి జయలక్ష్మి వ్యవసాయ కూలీగా కుటుంబాన్ని పోషిస్తున్నారు. దాచుకున్న సొమ్ముకుతోడు కొంత బ్యాంకు రుణంద్వారా కుమారుడిని ఉన్నత చదువులకు పంపితే ఇలా జరిగిందని తల్లి జయలక్ష్మి రోదిస్తున్న తీరు అక్కడివారిని కన్నీళ్లు పెట్టించింది.

ట్రాక్ సక్రమంగా బిగించకపోవడం వల్లే ప్రమాదం!

న్యూఢిల్లీ : ఉత్తరప్రదేశ్ గోండా సమీపంలో ఇటీవల చండీగఢ్-డిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడానికి ట్రాక్‌ను సక్రమంగా బిగించకపోవడ మే కారణ మని ఐదుగురు రైల్వే సీనియర్ అధికారుల బృందం నివేదికను అందజేసింది. ఈ వాదనతో బృందం లోని సభ్యుడొకరు విబేధించినట్లు సమాచారం. ప్రమాదంపై రైల్వే సేఫ్టీ కమిషనర్ దర్యాప్తు ఇప్పటికే ప్రారంభమైందని, సీనియర్ అధికారుల నివేదికకు ప్రాధాన్యత లేదని నార్త్ ఈస్టర్న్ రైల్వే జోన్ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ తెలిపారు. ఈ ప్రమాదంలో నలుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు.


స్నేహం విలువ



గోపి, బాలు మంచి మిత్రులు. ఇద్దరూ ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్నారు. చదువులో ఇద్దరూ పోటీ పడతారు. గోపి మంచి గాయకుడు. బాలు పక్షులు, జంతువులు, వివిధ రకాల శబ్దాలను అనుకరించే మిమిక్రీ కళాకారుడు. వారి కళలలో మంచి పేరు రావడంతో ఇద్దరూ కలసి వివిధ కార్యక్రమాల్లో ప్రదర్శన ఇచ్చేవారు. జనం గోపి పాటలకు చప్పట్లు కొడితే, బాలు మిమిక్రీకి చప్పట్లు, ఈలలు, కేకలు వేసే వారు. ప్రతి ప్రదర్శనలో ఇలా జరగడంతో తనకన్నా బాలుకే ఎక్కువ ప్రశంసలు వస్తున్నాయని గోపి ఈర్ష్య పెంచుకున్నాడు. తనకు ఏదైనా ప్రదర్శన పిలుపు వస్తే బాలుని పిలవకుండా ఒక్కడే వెళ్ళడం మొదలు పెట్టాడు. బాలు మాత్రం తన ప్రదర్శనకు గోపిని పిలిచేవాడు. కాని తన కన్నా బాలుకే ఆదరణ పెరుగుతోందన్న అసూయతో గోపి వెళ్ళేవాడు కాదు. అలా బాలు స్నేహాన్ని దూరం చేసుకోసాగాడు.

ఇదంతా బాలు పట్టించుకోకుండా స్నేహానికి విలువ ఇచ్చేవాడు. గోపి ఇంటికి వెళ్లేవాడు. గోపి ఇల్లు ఊరి చివరన ఉంటుంది. ఒకరోజు ఆ ఇంట్లో దొంగలు చొరబడ్డారు. గోపిని, వాళ్ళ అమ్మ, నాన్నని తాళ్ళతో కట్టేసి డబ్బులు, బంగారం మూట కట్టుకుంటుండగా అక్కడికి బాలు వచ్చాడు. ఇంట్లో దొంగలున్నారని గమనించి చాటునుంచి పోలీసు సైరన్‌లా అరవసాగాడు. ఆ శబ్దానికి అదిరి పడ్డ దొంగలు పోలీసులు వచ్చారని మూటను అక్కడే వదిలేసి పలాయనం చిత్తగించారు. దొంగలు వెళ్ళిపోయారని నిర్ధారించుకున్న బాలు గోపి ఇంట్లోకి వెళ్లి వాళ్ళ కట్లు విప్పాడు. సమయానికి బాలు రాకపోయుంటే తమ డబ్బు, నగలు పోయుండేవని గోపి వాళ్ల అమ్మానాన్న బాలుకి కృతజ్ఞతలు తెలిపారు. బాలు స్నేహానికి తను విలువ ఇవ్వలేదని గోపి సిగ్గుతో తల దించుకున్నాడు. దొంగల నుంచి తమని బాలు కాపాడిన విషయాన్ని పాఠశాలలో ఉపాధ్యాయులకు చెప్పాడు. పాఠశాల వార్షికోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి బాలుని అభినందించారు. బాలు స్నేహానికిచ్చే విలువ తెలుసుకున్న గోపీ ఆ రోజు నుంచి బాలు స్నేహాన్ని వదలలేదు.

- కయ్యూరు బాల సుబ్రమణ్యం
77802 77240



లెక్క తేల్చండి

పిల్లలూ, ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని అంకెలుగా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 58



నేను గీసిన బొమ్మ



బి.లోహిత,
4వ తరగతి,
దిగువ సాంబయ్య పాలెం,
తిరుపతి జిల్లా.

వర్షంవేళ ఇంటి శుభ్రత ఇలా ...



నాలుగు రోజుల నుండి ఒకటే వాన. ఇంట్లో, బయటా ఎక్కడ చూసినా తేమ, నీళ్లు. ఈ వాతావరణం క్రిమికీటకాల వృద్ధికి అనువైనది. ఫలితంగా రోగాలకు కారణమవుతుంది. ఈ కాలంలో పరిసరాలు, ఇల్లు శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం.

నేలను ఇలా శుభ్రం చేసుకోండి..

♦ ఎంత శుభ్రం చేసినా ఇంట్లో ధూళి, బురద కనిపిస్తూనే ఉంటుంది. దీనివల్ల దుర్వాసన వస్తుంది. మెట్ల దారి ఉన్న ఇళ్లల్లో అయితే నీళ్ల వల్ల జారిపడే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలను నివారించడానికి, ప్రతిరోజూ ఫ్లోర్ క్లీనర్‌తో నేలను శుభ్రం చేసుకోవాలి.

బాత్‌రూమ్‌లు, టాయిలెట్లలో క్రిమికీటకాలు వృద్ధి చెందే అవకాశాలు ఎక్కువ. కాబట్టి వాటి శుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. టాయిలెట్ క్లీనర్, బాత్‌రూమ్ క్లీనర్‌తో పాటు, టాయిలెట్, సింక్ షవర్‌ను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలి.

పైపు లైన్లు తనిఖీ చేసుకోవాలి..

ఇంటి నుండి వృధా నీళ్లు బయటికి వెళ్లే గట్టర్‌లు, డౌన్‌స్పౌట్‌లను తనిఖీ చేసుకోవాలి. వాటిలో ఏ అడ్డంకులు లేకుండా మరమ్మతులు చేసుకోవాలి.

వర్షాకాలంలో పైపులు, పైకప్పులు లీకేజీ సమస్యలు వస్తుంటాయి. కాబట్టి వర్షాకాలం ప్రారంభానికి ముందే, లీకేజీలను తనిఖీ చేయాలి. ఇంట్లో చిన్న చిన్న పగుళ్లు ఉన్నా వాటిని పూడ్చుకోవాలి.

అదేపనిగా వాననీళ్లు పడి, కిటికీలు, అద్దాలు చాలా త్వరగా మురికిగా మారుతాయి. వాటిని శుభ్రంగా ఉంచడానికి, గ్లాస్ క్లీనర్ లిక్విడ్ (ఉత్పత్తి లింక్)ని ఉపయోగించాలి.

తరచూ చేతులను శుభ్రం చేసుకోవాలి

వర్షాకాలంలో చేతులను శుభ్రంగా ఉంచుకోవడం చాలా ముఖ్యం. క్రిమిసంహారక హ్యాండ్ జెల్ లేదా శానిటైజర్‌లను ఉపయోగించాలి. రెస్ట్‌రూమ్‌ని ఉపయోగించిన తర్వాత, బయటి నుండి వచ్చిన తరువాత, తినడానికి ముందు కచ్చితంగా చేతులను శుభ్రం చేసుకోవాలి.

ఈ కాలంలో ఇంటిని తాజాగా, శుభ్రంగా మంచి సువాసనలు వెదజల్లేలా ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించబడిన ఎయిర్ ఫ్రెషనర్‌లను ఎంచుకోవాలి.

వంటగదిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

వర్షాకాలంలో వంటగది శుభ్రత చాలా ముఖ్యం. పాత్రలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, పొయ్యి, పొయ్యి గట్టు పొడిగా ఉండేలా చూసుకోవడం ఈ కాలంలో చాలా మంచిది.

1. వంట చేసిన తర్వాత పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. షింక్‌లో పడేసి ఉంచొద్దు. పాత్రల శుభ్రతలో కూడా మంచి సువాసన వచ్చే డిష్ వాష్ జెల్ ఉపయోగించాలి.

2. గది శుభ్రంగా ఉండడం కోసం, అధిక-నాణ్యత గల కిచెన్ సర్ఫేస్ క్లీనర్‌ను ఉపయోగించాలి.

3. వంట పూర్తయిన వెంటనే స్టవ్, గట్టును శుభ్రం చేసుకోవాలి. ఎటువంటి ఆహార పదార్థాలు అక్కడ నిల్వ లేకుండా చూసుకోవాలి.


4. ఆహారాన్ని గాలి చొరబడని కంటైనర్లలో ఉంచాలి. ఇలా చేస్తే ఆహారానికి తేమ చేరకుండా చెడిపోకుండా చేస్తుంది.

ఇలా శుభ్రం చేసుకోండి..

♦ వంటగది ప్లాట్‌ఫారమ్, స్టవ్ చుట్టూ శుభ్రం చేయడానికి, సగం నిమ్మకాయను కట్ చేసి రుద్దాలి. టైల్స్‌పై కూడా రుద్దాలి.

♦ బేకింగ్ సోడాను నీటిలో కరిగించి వంటగదిని శుభ్రం చేసుకోవచ్చు. నిమ్మకాయను సగానికి కట్ చేసి దానిపై బేకింగ్ సోడా చల్లి టైల్స్, పాత్రలు, సింక్ చుట్టూ శుభ్రం చేయాలి. ఇది జిడ్డును తొలగిస్తుంది. దుర్వాసనను కూడా నివారిస్తుంది.

♦ వేపనూనె లేదా లవంగం నూనెను నీటిలో కలిపి అక్కడక్కడ పిచికారీ చేస్తూ ఉండాలి. దాని సహాయంతో కీటకాలు, ఫంగస్, బ్యాక్టీరియా వ్యాప్తి చెందవు. వీటితో వంటగదిని శుభ్రం చేస్తే దుర్వాసన కూడా దానంతటదే వెళ్లిపోతుంది.





ప్రెషర్ కుక్కర్ లీక్ అవ్వకుండా ...

వంట సమయంలో పప్పులు, బియ్యం వండడానికి ప్రెషర్ కుక్కర్ ఉపయోగించడం చాలా సాధారణం. అయితే, కొన్నిసార్లు వంట చేస్తున్నప్పుడు, కుక్కర్ నుండి నీరు బయటకు వస్తూ ఈలలు వేయడం ప్రారంభిస్తుంది. అటువంటి పరిస్థితిలో 5 సులభమైన చిట్కాల సహాయంతో కుక్కర్‌లో నీరు లీక్ కాకుండా చేసుకోవచ్చు.

రబ్బరును తనిఖీ చేయాలి : కుక్కర్ మూతపై ఉన్న రబ్బరు చాలాసార్లు వదులుగా మారుతుంది. దీని కారణంగా కుక్కర్ నుండి నీరు బయటకు రావడం ప్రారంభమవుతుంది. అటువంటి పరిస్థితిలో కుక్కర్ రబ్బరును ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. రబ్బరు వదులుగా మారితే, డౌ లేదా టేప్ బంతితో మూత మూసివేయవచ్చు. దీని వల్ల నీరు బయటకు రాదు.

విజిల్‌ను శుభ్రం చేయాలి : కుక్కర్‌లోని విజిల్‌లో చాలా సార్లు ఆహారం ఇరుక్కు పోతుంది. అదే సమయంలో విజిల్ మురికిగా ఉంటే కుక్కర్‌లో ఆవిరి ఉత్పత్తి కాదు. కాబట్టి కుక్కర్ విజిల్ తెరిచి, దాన్ని పూర్తిగా శుభ్రం చేసిన తర్వాత మాత్రమే కుక్కర్లో ఉంచండి. దీనివల్ల కుక్కర్‌లో నుంచి నీరు వస్తుందన్న భయం ఉండదు.

నూనె వేయాలి : కుక్కర్ నుండి నీరు రాకుండా ఉండేందుకు నూనెను కూడా ఉపయోగించవచ్చు. కుక్కర్ మూత చుట్టూ నూనె వేస్తే, కుక్కర్‌లో నుంచి నీరు బయటకు రాదు.

చల్లటి నీటిని వాడండి : కుక్కర్‌లో నుంచి నీరు వస్తుంటే మూత తెరిచి చల్లటి నీళ్లతో కడిగి మళ్లీ కుక్కర్‌లో పెట్టాలి. దీంతో కుక్కర్ నుండి నీరు రాకుండా ఆపవచ్చు.

మంట, నీటిపై శ్రద్ధ వహించండి : కుక్కర్‌లో ఎక్కువ నీరు పోయడం లేదా కుక్కర్‌ను ఎక్కువ మంటలో ఉంచడం వల్ల కూడా నీరు బయటకు వస్తుంది. కాబట్టి కుక్కర్‌లో ఆహారాన్ని వండేటప్పుడు, నీటి పరిమాణంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అలాగే మీడియం మంట మీద వంట చేయాలి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68